ప్రజాశక్తి
మంగళవారం 28 జనవరి 2025
8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి

గుంతల దారులు

◆ సంక్రాంతికి పూర్తికాని మరమ్మతులు ◆ ప్రయాణికులకు తప్పని అవస్థలు



అధ్వానంగా ఉన్న నర్సీపట్నం రహదారి

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి, కోటవురట్ల విలేకరి

రాష్ట్రంలో సంక్రాంతి నాటికి రహదారుల మరమ్మతులు పూర్తిచేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గతేడాది నవంబరు 2న ప్రకటించినప్పటికీ జిల్లాలో గుంతలు పూడ్చని రహదారులు దాదాపు 34 శాతమున్నాయి. దీంతో ప్రజలకు అవస్థలు తప్పడం లేదు. జిల్లాలోని పరవాడ మండలం వెన్నెలపాలెం కూడలిలో నవంబరు 2న రహదారి గుంతల పనులు ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్న సిఎం రహదారుల మరమ్మతు పనుల పురోగతిని డ్రోన్ల ద్వారా తెలుసుకుంటానన్నారు. ఈ క్రమంలో జిల్లాలో రోడ్లు భవనాల శాఖ పరిధిలోని 521 కిలోమీటర్ల పొడవు కలిగిన 119 రహదారి మరమ్మతుల పనులకు రూ.8.80 కోట్లును ప్రభుత్వం మంజూరు చేసింది. వీటిలో 111 పనులను ప్రారంభించి 346 కిలోమీటర్లలో మరమ్మతు పనులు చేశారు. అయితే, రహదారుల మరమ్మతులకు నిధులు సకాలంలో విడుదల కాకపోవడంతో ఆ ప్రభావం పనులపై పడింది. పనులు ఆశించిన స్థాయిలో జరగడంలేదు. దీంతో ప్రయాణికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వర్షాలు పడినప్పుడు రోడ్లలో ఏర్పడిన పెద్ద గుంతల్లో నీరు చేరికతో ప్రయాణించడానికి జనం భయపడుతున్నారు. నీరు ఉండడంతో గోతులు తెలీక కిందపడిన ప్రయాణికులు లేకపోలేదు. ఎస్.రాయవరం మండలం అడ్డు రోడ్డు నుంచి నర్సీపట్నం వెళ్లే రహదారిలో అనేకచోట్ల పెద్దపెద్ద గోతులు ఏర్పడ్డాయి. ఈ రహదారి నిరంతరం ఆటోలు, ద్విచక్ర వాహనాలు, కార్లతో రద్దీగా ఉంటుంది. స్పీకర్ అయ్యన్నపాత్రుడు, హోం మంత్రి వంగలపూడి అనిత ప్రాతినిధ్యం వహిస్తున్న నర్సీపట్నం, పాయకరావుపేట మిగతా 2లో..



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జగ్గునాయుడు, కుమార్, కృష్ణారావు

'ఉక్కు' రక్షణ జాతాను జయప్రదం చేయండి

◆ నేడు ప్రారంభం, కూర్మన్నపాలెం కూడలి వద్ద సభ

◆ సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను అమ్మేసే నిర్ణయాన్ని మోడీ ప్రభుత్వం రద్దు చేయాలని, కర్మాగారాన్ని సెయిల్‌లో విలీనం చేసి, సొంత గనులు కేటాయించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 28 నుంచి 31 వరకు విశాఖ ఉక్కు రక్షణ రాష్ట్ర జాతా నిర్వహిస్తున్నట్లు సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు తెలిపారు. సోమవారం జగదాంబ దరి పార్టీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన జాతా వివరాలను వెల్లడించారు. పార్టీ రాష్ట్ర మహాసభ పోస్టర్‌ను ఆవిష్కరించారు. జాతా ప్రారంభ సూచికగా మంగళవారం సాయంత్రం 5 గంటలకు విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యాన కూర్మన్నపాలెం వద్ద నడుస్తున్న దీక్షా శిబిరం వద్ద సభ జరుగుతుందని, అనంతరం జాతాను పార్టీ రాష్ట్ర నాయకులు సిహెచ్.నర్సింగరావు ప్రారంభిస్తారని తెలిపారు. ఈ జాతా రాష్ట్రంలో పలు జిల్లాల్లో పర్యటిస్తూ, సభలు నిర్వహిస్తూ 31 రాత్రికి నెల్లూరు జిల్లాకు చేరుకుంటుందన్నారు. నెల్లూరులో మిగతా 2లో..

పథకాలను ప్రజలకు వివరించాలి

వార్త 8లో..

కారిడార్ నిర్వాసితుల ధర్నా

వార్త 8లో..

నిత్యావసరాల ధరలను నియంత్రించాలి

వార్త 5లో..



అనకాపల్లి దీక్షలను ప్రారంభిస్తున్న రూపాదేవి

సమస్యలపై విఒఎల సామూహిక దీక్షలు

వేతన బకాయిలు చెల్లించాలని డిమాండ్

వార్త 2లో..

సడలింపులు ఇవ్వాలి

◆ 1/70 చట్టంపై స్పీకర్ అయ్యన్న వివాదాస్పద వ్యాఖ్యలు

◆ విశాఖలో పర్యాటక పెట్టుబడిదారుల సదస్సు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : పర్యాటక రంగ అభివృద్ధిలో భాగంగా 1/70 చట్టంలో సడలింపులు ఇస్తే ఇన్వెస్టర్లు ముందుకు వస్తారంటూ స్పీకర్ సిహెచ్.అయ్యన్నపాత్రుడు విశాఖ వేదికగా సోమవారం వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. గిరిజనులకు, వారి భూములకు ఎంతో రక్షణ కల్పించే ఈ ప్రత్యేక చట్టంపై ఆయన చేసిన వ్యాఖ్యలు ఆదివాసీ ప్రాంతాన్ని పాలసీల పేరిట కార్పొరేట్లకు అప్పగించే కుట్రలో భాగమేనన్న విమర్శలు వినిపిస్తున్నాయి. అసలింతకీ ఏం జరిగిందంటే..

ఆంధ్రప్రదేశ్ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో విశాఖపట్నం వేదికగా నిర్వహిస్తున్న రెండో ప్రాంతీయ పర్యాటక పెట్టుబడిదారుల సదస్సు బీచ్ రోడ్డులోని నోవాటెల్ హోటల్‌లో సోమవారం జరిగింది. దీనిలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో టూరిజం అభివృద్ధికి చేపట్టాల్సిన చర్యలను వివరించారు. పర్యాటక శాఖలో పెట్టుబడులు పెట్టేవారికి ఆటంకాలు లేకుండా చూడాలని తెలిపారు. నర్సీపట్నం సమీపంలోని లంబసింగికి వేలాదిగా పర్యాటకులు వస్తున్నారని, కనీస సౌకర్యాలు లేకపోవడం శోచనీయమని అన్నారు. పాడేరు అమ్మవారి దేవాలయాన్ని, స్వాతంత్ర్య సమరయోధుడు అల్లూరి సీతారామరాజు పార్కును, పురాతన బొజ్జన్నకొండను మరింత వృద్ధి చేయాల్సిన అవసరం ఉందన్నారు. జర్మనీ మాదిరిగా విశాఖలోని ఆర్కే బీచ్ నుండి భీమిలి బీచ్ వరకు చిన్న చిన్న హట్స్ వేయాలని కోరారు. 1/70 చట్ట మిగతా 2లో..



సదస్సులో మాట్లాడుతున్న అయ్యన్నపాత్రుడు

మొదటి పేజీ తరువాయి..

గుంతల దారులు

నియోజకవర్గాల మధ్యనున్న ఈ రహదారి గోతులు పడి ఎన్నో నెలలవుతున్నా మరమ్మతులు చేపట్టలేదు. కోటవురట్ల మండలంలోని అన్నవరం, రాజుపేట రహదారులు శిథిలావస్థకు చేరుకున్నాయి. లింగాపురం - వెంకటాపురం రహదారి ప్రయాణాలకు కష్టతరంగా మారింది. గొలుగొండ మండలం రావనాపల్లి - పాకలపాడు రహదారికి మరమ్మతులు చేయలేదు. సంక్రాంతికి చుక్కల్లాంటి రోడ్లు వేస్తామన్న సిఎం మాటలు ఆచరణరూపం దాల్చకపోవడంపై విమర్శలు వినిపిస్తున్నాయి.

సడలింపులు ఇవ్వాలి

ప్రకారం గిరిజన ప్రాంతంలో పెట్టుబడులు గిరిజనులే చేయాలని, కానీ అంత పెద్ద మొత్తం వారు చేయగలరా ? అని ప్రశ్నించారు. చట్టంలో సడలింపులు ఇస్తే ఇన్వెస్టర్లు ముందుకు వస్తారన్నారు. విశాఖ ఉత్సవ్‌లాంటి కార్యక్రమాలను ప్రోత్సహించాల్సిన అవసరముందన్నారు. రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ అద్భుత ప్రకృతి రమణీయతకు చిరునామా ఉత్తరాంధ్ర ప్రాంతమని, ఇక్కడ పర్యాటక ప్రాజెక్టులను తీసుకురావడం ద్వారా ఈ ప్రాంతాన్ని మరింత అభివృద్ధి చేస్తామని అన్నారు. స్పెషల్ చీఫ్ సెక్రటరీ, పర్యాటక శాఖ సెక్రటరీ అజయ్ జైన్ మాట్లాడుతూ ఇప్పటికే విజయవాడలో ఒక ఇన్వెస్టర్ సమ్మిట్ నిర్వహించామని, ప్రస్తుతం రెండో సమ్మిట్‌కు విశాఖ వేదికైందని అన్నారు. భవిష్యత్తులో ఒకే ఇజం ఉంటుందని, అదే టూరిజమని అన్నారు. విజన్ 2047 డాక్యుమెంట్‌లో సైతం పర్యాటక రంగానికి ముఖ్యమంత్రి అగ్ర ప్రాధాన్యత ఇచ్చారని గుర్తుచేశారు. స్టాంప్ డ్యూటీ, టాన్స్ఫర్ డ్యూటీ, ల్యాండ్ కన్వర్షన్ ఛార్జీలను మినహాయిస్తూ విడుదల చేసిన నూతన పర్యాటక పాలసీ 2025-29 అద్భుతంగా ఉందన్నారు. కార్యక్రమంలో టూరిజం ఎమ్‌డి ఆమ్రపాలి, విశాఖ కలెక్టర్ హరేంధిర ప్రసాద్, మాడుగుల, నెల్లిమర్ల ఎమ్మెల్యేలు బండారు సత్యనారాయణమూర్తి, లోకం నాగమాధవి, ఏపీటీడీసీ ఛైర్మన్ నూకసాని బాలాజీ, అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్, అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయ్ కృష్ణన్ పాల్గొన్నారు.

ఒప్పందాల వివరాలివీ..

అట్మాస్ఫియర్ కోర్ సంస్థ యారాడ బీచ్‌లో రూ.500 కోట్లు, అమరావతిలో రూ.250 కోట్లు, తిరుపతిలో రూ.250 కోట్లు పెట్టుబడితో మొత్తం మూడు హోటళ్లను నిర్మించేందుకు ఒప్పందం కుదిరింది. సుమీ యశశ్రీ సంస్థ 50 కోట్ల పెట్టుబడితో విశాఖపట్నం, గుంటూరుల్లో రిసార్టులు నిర్మించేందుకు ఒప్పందం చేసుకుంది. ఎవరెస్ట్ ఎంటర్‌ప్రైజెస్ సంస్థ వారు విశాఖపట్నంలో ఏడు కోట్ల రూపాయల వ్యయంతో వెల్‌నెస్ రిసార్ట్ నిర్మించేందుకు ఒప్పందం చేసుకున్నారు. రాయల్ పామ్స్ సంస్థ వారు బాపట్లలో రూ.30 కోట్ల పెట్టుబడితో విలాసవంతమైన రిసార్ట్ నిర్మించేందుకు ఒప్పందం చేసుకున్నారు. రిప్పిల్స్ అండ్ కో సంస్థ వారు అల్లూరి సీతారామరాజు జిల్లా సరియపల్లి గ్రామంలో రూ.100 కోట్ల పెట్టుబడితో కన్వెన్షన్ సెంటర్, డెస్టినేషన్ వెడ్డింగ్ సెంటర్ ఏర్పాటు చేసేందుకు ఒప్పందం చేసుకున్నారు. బ్లూ రే ఇన్ఫో ప్రాజెక్ట్ సంస్థ వారు రూ.18 కోట్ల పెట్టుబడితో విశాఖపట్నం సమీపంలోని భోగాపురం ఎయిర్‌పోర్టు వద్ద బీచ్ ఫ్రంట్ హోటల్, రిసార్ట్ నిర్మించేందుకు ఒప్పందం చేసుకున్నారు. హోటల్ ఎస్ పార్క్ సంస్థ వారు ఏడు కోట్ల పెట్టుబడితో బాపట్ల వద్ద హోటల్ అండ్ రిసార్ట్ నిర్మించేందుకు ఒప్పందం చేసుకున్నారు. డాల్ఫిన్ ఓషన్ క్రూజ్ సంస్థ వారు ఐదు కోట్ల పెట్టుబడితో విశాఖపట్నంలో యత్ఛ్ క్రూజ్ టూర్స్ ఏర్పాటుకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందం చేసుకున్నారు.

'ఉక్కు' రక్షణ జాతాను జయప్రదం చేయండి

ఫిబ్రవరి 1, 2, 3 తేదీల్లో జరిగే సిపిఎం 27వ రాష్ట్ర మహాసభల్లో స్టీల్ ప్లాంట్ రక్షణ అంశంపై ప్రత్యేకంగా చర్చించి తీర్మానం చేయనున్నట్టు తెలిపారు.

కేంద్ర బిజెపి మంత్రివర్గం వైజాగ్ స్టీల్ ప్లాంట్‌ను స్ట్రాటజిక్ సేల్ పేరుతో 100 శాతం ప్రైవేటీకరిస్తున్నట్లు 2021 జనవరి 27న ప్రకటించిందన్నారు. నేటికి నాలుగేళ్లు పూర్తయిందని అన్నారు. కార్మికులు పోరాడుతున్నా.. ప్రైవేటీకరణ నిర్ణయాన్ని నేటికీ రద్దు చేయలేదన్నారు. ప్లాంట్ ప్రైవేటీకరణ జరగదని కేంద్ర మంత్రులు, రాష్ట్ర ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, టిడిపి, జనసేన, బిజెపి కూటమి నేతలు ప్రకటనలు చేస్తున్నారన్నారు. అయితే, ప్రధాని మోడీ లేదా కేంద్ర మంత్రివర్గంతో ఈ ప్రకటన చేయించాలని, అప్పుడే స్టీల్ ప్లాంట్‌కు రక్షణ ఉంటుందని అన్నారు. విశాఖ ఉక్కుకు రూ.11,440 కోట్లు భారీ ప్యాకేజీ ప్రకటించామని, ఇక పరిశ్రమను లాభాలు బాట పట్టించాల్సిన బాధ్యత విశాఖ ఉక్కు యాజమాన్యం, కార్మికులపైనే ఉందని పేర్కొంటూ తమ బాధ్యత తీరిపోయినట్లుగా కూటమి నేతలు ప్రకటనలు చేస్తున్నారన్నారు. ఇది స్టీల్‌ప్లాంట్ అసలు సమస్యను పక్కదారి పట్టించడమే అవుతుందన్నారు. స్టీల్‌ప్లాంట్ లాభాల బాట పట్టాలంటే సొంత గనులు కేటాయించాలి లేదా సెయిల్‌లో విలీనం చేయాలని అన్నారు. స్ట్రాటజిక్ సేల్ నిర్ణయాన్ని రద్దు చేయాలన్నారు. ఇది చేయకుండా స్టీల్‌ప్లాంట్ లాభాలు బాట పట్టడం అసంభవమని అన్నారు. విశాఖ ఉక్కుకు సొంత గనులు లేక ప్రతి సంవత్సరం సుమారు రూ.30 వేల కోట్లు అదనపు ఉత్పత్తి వ్యయాన్ని భరిస్తోందన్నారు. ఈ విషయం కూటమి నేతలకు కూడా తెలుసునన్నారు. ప్యాకేజీకే పరిమితం కాకుండా ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, బిజెపి కేంద్ర మంత్రులు కేంద్రాన్ని ఒప్పించి స్ట్రాటజిక్ సేల్ నిర్ణయాన్ని రద్దు చేయించాలన్నారు. నిర్వాసితులకు ప్లాంట్‌లో శాశ్వత ఉద్యోగాలు ఇవ్వాలని, ఆఫీసర్లు, పర్మినెంట్, కాంట్రాక్ట్ కార్మికులకు జీతాల బకాయిలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్మికుల తొలగింపు చర్యలను మానుకోవాలన్నారు. స్టీల్‌ప్లాంట్ వాస్తవ పరిస్థితులను కార్మికులకు, ప్రజలకు వివరించి పోరాట లక్ష్యాలు సాధించే వరకూ ఉద్యమాన్ని మరింత విస్తృత పరిచేందుకు సిపిఎం పై జాతాను చేపడుతోందన్నారు. 28న జరిగే జాతా ప్రారంభ సభలో విశాఖ ఉక్కు కార్మికులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని, రాష్ట్ర జాతాను ఆదరించి ఉక్కు పరిరక్షణ పోరాటంలో మరింత పెద్ద ఎత్తున భాగస్వాములు కావాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆర్‌కెఎస్‌వి.కుమార్, వి.కృష్ణారావు పాల్గొన్నారు.

సమస్యలపై విఓఎల సామూహిక దీక్షలు

వేతన బకాయిలు చెల్లించాలని డిమాండ్

ప్రజాశక్తి - అనకాపల్లి : తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వెలుగు విఓఎలు అనకాపల్లి కలెక్టరేట్ వద్ద సామూహిక దీక్షలు చేపట్టారు. దీక్షలను ఎపి వెలుగు యానిమేటర్ల సంఘం (సిఐటియు) రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్.రూపాదేవి, జిల్లా గౌరవాధ్యక్షులు వివి.శ్రీనివాసరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా రూపాదేవి, శ్రీనివాసరావు, కె.సూరిబాబు మాట్లాడుతూ నెలల తరబడి గౌరవ వేతనం అందక విఓఎల కుటుంబాలన్నీ ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయని, సంక్రాంతి పండుగకు వేతనాలు ఇవ్వకుండా పస్తులుంచడం దుర్మార్గమని అన్నారు. గత నెల 16న యూనియన్ నాయకులతో జరిపిన చర్చల్లో సెర్ప్ సిఇఒ పండగలోపు జీతాలన్నీ చెల్లిస్తామని ఇచ్చిన హామీ నెరవేరలేదని, అందుకే ఈ పోరాటానికి రాష్ట్రవ్యాప్తంగా విఓఎలు సిద్ధమయ్యారని అన్నారు. విఓఎల మూడేళ్ల కాలపరిమితి సర్క్యులర్‌ను అనేక ఒత్తిళ్లలో గత ప్రభుత్వం అమలును నిలుపుదల చేసిందన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కాలపరిమితి సర్క్యులర్‌ను రద్దు చేసి విఓఎల అన్ని సమస్యలనూ పరిష్కరించి ఆదుకోవాలని కోరారు. నెలాఖరులోగా సమస్యలను పరిష్కరించకుంటే ఫిబ్రవరి ఒకటో తేదీ నుంచి తాము నిర్వహిస్తున్న పనులు నిలుపుదల చేసి నిరసన కొనసాగిస్తామని స్పష్టం చేశారు. దీక్షల్లో యూనియన్ కోశాధికారి కె.లక్ష్మీప్రసన్న, వై.లక్ష్మి, అప్పలనాయుడు, రమణ, మాణిక్యం, భవాని, రమణమ్మ, లావణ్య, జగదీశ్వరి, లక్ష్మీ, డి. రమేష్ పాల్గొన్నారు.



విశాఖలో దీక్షలు చేపట్టిన విఓఎలు

ఐద్వా, ప్రజాసంఘాల సంఘీభావం

విఓఎల దీక్షలకు ఐద్వా రాష్ట్ర అధ్యక్షులు బి.ప్రభావతి, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పి.మాణిక్యం, డిడి.వరలక్ష్మి ఉపాధ్యక్షులు ఆర్.లక్ష్మి, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా గౌరవాధ్యక్షులు ఎ.రాజు, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రమణ, ఎన్.సత్యనారాయణ మద్దతు తెలిపారు.

విశాఖ కలెక్టరేట్ : జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద ఎపి వెలుగు విఒఎ (యానిమేటర్స్), ఉద్యోగుల సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిరాహార దీక్షలు చేపట్టారు. దీక్షా శిబిరాన్ని సిఐటియు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విఓఎల సమస్యల పరిష్కారంపై తీవ్ర అలసత్వం వహిస్తోందన్నారు. ప్రతినెలా జీతం ఇవ్వాల్సిన కనీస బాధ్యతను ప్రభుత్వం నిర్వహించకపోవడం దుర్మార్గమన్నారు.

6 నెలలుగా జీతం ఇవ్వకుండా పని చేయించుకోవడం వెట్టి చాకిరీ అవుతుందన్నారు. ఎన్నికల హామీలను తక్షణం అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ గౌరవాధ్యక్షురాలు పి.మణి, అధ్యక్ష, కార్యదర్శులు అపర్ణ, కంచమ్మ, కోశాధికారి శ్రీలక్ష్మి, నాయకులు వెంకటలక్ష్మి, పార్వతి, శారద పాల్గొన్నారు.

23న ఇండియన్ మ్యాజిక్ అవార్డ్స్ నైట్

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ : ఇండియన్ మ్యాజిక్ అకాడమీ దశమ వార్షికోత్సం, అంతర్జాతీయ ఇంద్రజాలికుల దినోత్సవాన్ని పురస్కరించుకొని వచ్చేనెల 23న విశాఖపట్నం కళాభారతి ఆడిటోరియంలో ఇండియన్ మ్యాజిక్ అవార్డ్స్ నైట్ నిర్వహించనున్నారు. సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు ఇంద్రజాలికుడు డాక్టర్ బిఎస్ రెడ్డి సారథ్యంలో నిర్వహించే ఐఎంఎ అవార్డ్స్ నైట్ వాల్‌పోస్టర్‌ను సోమవారం హోటల్ నొవోటెల్‌లో రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖామంత్రి కందుల దుర్గేష్ ఆవిష్కరించారు. ఐఎంఎ దశమ వార్షికోత్సవ సందర్భంగా పిసి సర్కార్ తనయుడు జూనియర్ పిసి సర్కార్ కు జీవన సాఫల్య పురస్కారం, మరో 10 మంది దేశ, విదేశీ మెజీషియన్లకు ఐఎంఎ అవార్డులను ప్రదానం చేయనున్నారు. తాను తప్పకుండా ఈ కార్యక్రమానికి హాజరవుతానని మంత్రి దుర్గేష్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బీఎస్ రెడ్డితోపాటు ఐఎంఏ కార్యవర్గం, ఉత్సవ నిర్వహణా కమిటీ సభ్యులు, మెజీషియన్లు విజయ్ కుమార్, ఎంఏ రెడ్డి, సుదర్శన్ పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వినతుల వెల్లువ

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : జివిఎంసిలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 58 వినతులు వచ్చాయని నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి పేర్కొన్నారు. సోమవారం జివిఎంసి ప్రధాన కార్యాలయంలోని పాత సమావేశ మందిరంలో జివిఎంసి అదనపు కమిషనరు డివి.రమణమూర్తితో కలిసి ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని ఆమె నిర్వహించారు. పోలీస్ కమిషనరేట్‌లో నిర్వహించిన కార్యక్రమంలో 79 ఫిర్యాదులు సిపి శంకబ్రత బాగ్చికి అందాయి. ఆ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు.

దావోస్‌లో బాబుది పెద్దన్న పాత్ర

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : దావోస్‌లో చంద్రబాబు పెద్దన్న పాత్ర పోషించారని టిడిపి రాష్ట్ర అధ్యక్షులు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, ఎంపీ ఎం.శ్రీ భరత్ అన్నారు. సోమవారం జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. దావోస్ ఫలాలు తప్పనిసరిగా రాష్ట్రానికి ఉంటాయని చెప్పారు. యువగళం ద్వారా లోకేష్ ప్రజల్లోకి వెళ్లారని, ప్రజా సమస్యలపై పూర్తి స్థాయిలో అవగాహన తెచ్చుకున్నారని అన్నారు. మంగళగిరిలో ప్రజా దర్బార్ ద్వారా ప్రజలకు మరింత చేరువయ్యారని తెలిపారు.

వేగం ప్రమాదకరం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : వేగం ఆనందదాయకమేగానీ చాలా ప్రమాదకరమని విశాఖపట్నం మోటార్ వెహికల్స్ ఇన్‌స్పెక్టర్ ఎం.బుచ్చిరాజు హెచ్చరించారు. సోమవారం ఎయు తెలుగు మీడియం హైస్కూల్‌లో సిఫా ట్రస్ట్ నేతృత్వంలో జిల్లా రవాణా శాఖ, పోలీసు విభాగం ఆధ్వర్యాన రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

పర్యావరణ హిత కట్టడాలకు ప్రాధాన్యం



వర్క్‌షాపులో మాట్లాడుతున్న చిత్రావిశ్వనాథ్

ప్రజాశక్తి -మధురవాడ : భవన నిర్మాణ రంగంలో అనవసర వ్యయాన్ని తగ్గించడంతో పాటు సహజ సిద్ధమైన నిర్మాణ సామగ్రిని ఉపయోగిస్తూ పర్యావరణ హిత కట్టడాలకు ప్రాధాన్యతనివ్వాలని బెంగళూరుకు చెందిన బయోమ్ ఎన్విరాన్‌మెంటల్ సొల్యూషన్స్ వ్యవస్థాపకులు, ప్రముఖ ఆర్కిటెక్ట్ చిత్ర విశ్వనాథ్ పేర్కొన్నారు. గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ ఆర్కిటెక్చర్ ఆధ్వర్యాన సోమవారం జరిగిన వర్క్‌షాప్‌లో ఆమె ప్రసంగించారు. భారత్‌తో సహ నైజీరియా వంటి దేశాలలో తాము దాదాపు 700కు పైగా భవనాలను కేవలం మట్టితో నిర్మించామని దాని వల్ల నిర్మాణ వ్యయం తగ్గడంతో పాటు పర్యావరణ కట్టడాలుగా అవి గుర్తింపు పొందాయని తెలిపారు. ఇంటి నిర్మాణం జరిగే సమయంలో అక్కడి నేలతో పాటు నీటి వనరుల లభ్యత, గాలి, వెలుతురు వంటివి పరిగణలోకి తీసుకుని నిర్మాణం చేపట్టడం వల్ల పర్యావరణానికి హాని కలగని విధంగా కట్టడాలు పూర్తి చేయవచ్చన్నారు. వాన నీటి సంరక్షణ పద్ధతులను, ప్రకృతి వనరులను విరివిగా నిర్మాణంలో వాడటం ద్వారా దీర్ఘకాలిక ప్రయోజనాలు ఉంటాయని తెలిపారు. తాము నిర్మించిన ఈ తరహా భవనాలలో ఫ్యాన్లు, ఏసీలు వాడనవసరం ఉండదని, సహజ సిద్ధమైన గాలి వెలుతురుతో పాటు చల్లదనం ఉంటుందని పేర్కొన్నారు. ఆర్కిటెక్ట్‌లు కార్బన్ ఫుట్‌ప్రింట్ తగ్గించేలా నిర్మాణాలకు ప్రాధాన్యత ఇవ్వాలని ఆమె సూచించారు. కార్యక్రమానికి స్కూల్ ఆఫ్ ఆర్కిటెక్చర్ డీన్ విభూతి సత్యదేవ్ అధ్యక్షత వహించారు.

విద్యార్థికి అభినందన

ప్రజాశక్తి- భీమునిపట్నం : చిత్ర లేఖన పోటీల్లో ప్రతిభ కనబరిచిన స్థానిక సెయింట్ ఆన్స్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ 7వ తరగతి విద్యార్థి ఎం.లక్ష్మీసాత్విక్‌ను స్కూల్ కరస్పాండెంట్ ట్రీసా మేరి, ప్రిన్సిపల్ క్రిష్టీ జాన్, ఉపాధ్యాయులు సోమవారం పాఠశాలలో అభినందించారు. భారత ప్రభుత్వానికి చెందిన మినిస్ట్రీ ఆఫ్ ఎడ్యుకేషన్ అండ్ మినిస్ట్రీ ఆఫ్ డిఫెన్స్, సమగ్ర శిక్ష ఆధ్వర్యాన గణతంత్ర దినోత్సవం సందర్భంగా చిత్ర లేఖన పోటీల్లో భగత్ సింగ్ చిత్ర పటాన్ని గీసినందుకు లక్ష్మీసాత్విక్ ప్రథమ బహుమతి పొందినట్లు కరస్పాండెంట్, ప్రిన్సిపల్ తెలిపారు.

'నైతిక విలువలే ప్రజ్ఞ ప్లే స్కూల్ లక్ష్యం'

ప్రజాశక్తి -మధురవాడ : విద్యతోపాటు నైతిక విలువలు నేర్పించడమే ప్రజ్ఞ ప్లే స్కూల్ లక్ష్యమని ప్రజ్ఞ విద్యాసంస్థల అధినేత పిల్ల విజయ్‌కుమార్ పేర్కొన్నారు. సోమవారం పిల్లలకు సామాజిక సేవపై అవగాహన కల్పించేందుకు స్థానిక హ్యాండ్స్ టు హెల్ప్ వైజాగ్ ఓల్డేజ్ హోమ్‌లోని పెద్దలకు నిత్యవసర సరుకులను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తమ విద్యార్థులకు బాల్యం నుంచే సామాజిక, నైతిక విలువలపై అవగాహన కల్పించాలని ఇటువంటి కార్యక్రమాలను చేపట్టిన స్కూల్ డైరెక్టర్ పిల్ల కృష్ణవృధ్వీతో పాటు ఉపాధ్యాయ బృందానికి అభినందనలు తెలిపారు. హ్యాండ్స్ టు హెల్ప్ సొసైటీ ఫౌండర్ చైర్మన్ చిన్ని వెంకట్ మాట్లాడుతూ, ఇటువంటి కార్యక్రమంలో తమను భాగస్వామిని చేయడం ఆనందంగా ఉందన్నారు. విశిష్ట అతిథి డాక్టర్ ఫాజిల్ మాట్లాడుతూ చిన్నారుల చేత ఇలాంటి కార్యక్రమం చేయడం మంచిదన్నారు. చిన్నారులకు వైద్య పరంగా సేవలందించేందుకు ప్రయత్నిస్తామన్నారు. కార్యక్రమంలో ఎమ్మెస్సార్ ప్రసాద్, డాక్టర్ కోన బాబూరావు, మహా శ్రీను, బి.రాము, కె.ధర్మారావు, శంకర్, సంతోష్, పి.గణేష్, చైతన్య తదితరులు పాల్గొన్నారు.

రహదారి భద్రతపై అవగాహన

ప్రజాశక్తి -భీమునిపట్నం : కేంద్ర యువజన, క్రీడల మంత్రిత్వ శాఖ, విశాఖ నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యాన రహదారి భద్రతపై స్థానిక ఎస్‌విఎల్‌ఎన్‌ఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా విశాఖ మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ బుచ్చిరాజు హాజరై మాట్లాడుతూ, మితిమీరిన వేగం వల్లనే రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని తెలిపారు. పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా రహదారి భద్రతకు సంబంధించి పలు అంశాలపై అవగాహన కల్పించారు. ముందుగా కళాశాల విద్యార్థులు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు రహదారి భద్రతపై అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విశాఖ, సమస్రయ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు ఆర్.లీలాప్రసాద్, వైస్ ప్రిన్సిపల్ బి.సహదేవుడు, ఐక్యూ ఎసి కో-ఆర్డినేటర్ బి.ప్రసాదరావు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి ఎస్.అప్పలనాయుడు, పలువురు అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.



అవగాహన ర్యాలీలో అధికారులు, విద్యార్థులు

7 కిలోల కణితి తొలగింపు



మహిళ కడుపులోంచి తొలగించిన కణితిని చూపిస్తున్న వైద్యులు

ప్రజాశక్తి- తగరపువలస : స్థానిక అనిల్ నీరు కొండ ఆసుపత్రిలో 33 ఏళ్ల మహిళ కడుపులో 40 సెంటీమీటర్ల పొడవు, 30 సెంటీమీటర్ల వెడల్పుతో ఏర్పడిన 7 కిలోల కణితిని మూడు గంటల వ్యవధిలో చేసిన అరుదైన శస్త్ర చికిత్స ద్వారా ఆసుపత్రి వైద్యులు తొలగించారు. ఇందుకు సంబంధించిన వివరాలను ఆసుపత్రిలో సోమవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆసుపత్రి డీన్ డాక్టర్ పి.వి.సుధాకర్ వెల్లడించారు. గ్రామీణ ప్రాంతాల్లో తమ ఆసుపత్రి ఆధ్వర్యాన నిర్వహిస్తున్న ఉచిత వైద్య శిబిరాల్లో భాగంగా ఒడిశా మల్కాజిగిరి జిల్లాలో ఇటీవల ఓ మహిళ వచ్చి తన బాధను వివరించారు. వైద్యుల సూచనల మేరకు జనవరి 8వ తేదీన తమ ఆసుపత్రిలో చేరగా, వివిధ పరీక్షల అనంతరం ఆమె కడుపులో పెద్ద కణితి ఉన్నట్లు వైద్యులు గుర్తించారు. అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ విద్యాసాగర్, డాక్టర్ ప్రత్యూష తదితరులతో కలిసి డాక్టర్ రంజిత్ మనోహర్ ఆమె కడుపులో ఉన్న కణితిని తొలగించారని వివరించారు. అనస్థీషియా వైద్యులు రాకేష్, రాజేంద్రప్రసాద్, అనీషా, రేడియాలజిస్ట్ డాక్టర్ దుర్గాప్రసాద్ సహకారంతో శస్త్ర చికిత్స విజయవంతం అయినట్లు తెలిపారు. విలేకరుల సమావేశంలో సంబంధిత వైద్యులతో పాటు మెడికల్ డైరెక్టర్ డాక్టర్ కె.చెంచురెడ్డి, ఆసుపత్రి అదనపు మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ప్రతిమాదేవి పాల్గొన్నారు.

శ్మశాన వాటిక పరిశుభ్రం

ప్రజాశక్తి- ఆనందపురం : మండలంలోని వేములవలస శ్మశాన వాటికను పంచాయతీ ఉప సర్పంచ్ కోరాడ నవీన్ జ్ఞానేశ్వర్ చొరవతో పరిశుభ్రం చేశారు. శ్మశాన వాటికకు వెళ్లే రహదారిలో పిచ్చి మొక్కలు పెరిగి నడవడానికి ఇబ్బందిగా ఉండేది. అంతిమ సంస్కారాలు చేసేందుకు కష్టం అయ్యేది. బోరు కూడా పాడవడంతో వచ్చేవారు తీవ్ర అవస్థలు పడేవారు. ఈ విషయం కోరాడ నవీన్ జ్ఞానేశ్వర్ దృష్టికి రావడంతో తక్షణమే స్పందించి పారిశుధ్య సిబ్బందితో పిచ్చి మొక్కలు తొలగించారు. బోరుకు మరమ్మతులు జరిపించి తిరిగి వినియోగంలోకి తీసుకొచ్చారు. రోడ్డుమీద పేరుకుపోయిన చెత్తను తొలగించి శుభ్రం చేయించారు. శ్మశాన వాటిక పరిశుభ్రతకు సహకరించిన పంచాయతీ కార్యదర్శి రామకృష్ణ, బోరు మరమ్మతులు చేపట్టిన సత్తిబాబు, పారిశుధ్య సిబ్బందికి కోరాడ నవీన్ జ్ఞానేశ్వర్ ధన్యవాదాలు తెలియజేశారు.

కబడ్డీ, వాలీబాల్ పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి -భీమునిపట్నం

ఫిబ్రవరి 1, 2 తేదీల్లో జరుగనున్న స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల శత వసంతాల వేడుకలు సందర్భంగా స్థానిక సెయింట్ ఆన్స్ పాఠశాల క్రీడా మైదానంలో సోమవారం కబడ్డీ, వాలీబాల్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను వేడుకల నిర్వహణ కమిటీ గౌరవాధ్యక్షులు కలిగొట్ల సూర్యనారాయణమూర్తి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉప విద్యాశాఖ అధికారి, వేడుకల నిర్వహణ నోడల్ అధికారి ఎ.సోమేశ్వరరావు, గంటా నూకరాజు, ఎం.షణ్ముఖరావు, ఎం.లక్ష్మణరావు, పి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఎపిడబ్ల్యుజెఎఫ్ సభ్యత్వాల పునరుద్ధరణ

ప్రజాశక్తి -తగరపువలస : ఎపిడబ్ల్యుజెఎఫ్ విశాఖ జిల్లా యూనిట్ ఆధ్వర్యాన స్థానిక ప్రెస్‌క్లబ్‌లో సోమవారం సభ్యుల సభ్యత్వ పునరుద్ధరణ కార్యక్రమం నిర్వహించారు. ఎపి వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ విశాఖ జిల్లా యూనిట్ 2025 ఏడాదికి గాను సభ్యత్వాల పునరుద్ధరణ, కొత్త సభ్యత్వాల నమోదు చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఎపి డబ్ల్యుజెఎఫ్ విశాఖ జిల్లా అధ్యక్షులు పి.నారాయణ్, కార్యదర్శి జి.శ్రీనివాస్ పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

వేర్వేరు చోట్ల ఇద్దరు ఆత్మహత్య

ప్రజాశక్తి-పద్మనాభం : మండలంలోని కృష్ణాపురం గ్రామానికి చెందిన ఇద్దరు వేర్వేరు చోట్ల ఆత్మహత్య చేసుకున్నారు. దీనికి సంబంధించి సిఐ సిహెచ్.శ్రీధర్ కథనం ప్రకారం... కృష్ణాపురం గ్రామానికి చెందిన ఆదిత్య (21), కనకాల లక్ష్మి (31) వేర్వేరు ప్రదేశాలలో ఉరి వేసుకొని మృతిచెందినట్లు కనిపించారు. బంధువుల ఫిర్యాదు మేరకు పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. మృతదేహాలను భీమిలి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

చోరీ సొత్తు స్వాధీనం

ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ : ఎంవిపి.కాలనీ సెక్టార్-3లో ఇటీవల జరిగిన చోరీ కేసును ఛేదించి సొత్తును స్వాధీనం చేసుకున్నామని ద్వారక క్రైమ్ ఎసిపి ఎ.వెంకటరావు తెలిపారు. సోమవారం ఎంవిపి క్రైమ్ పోలీసుస్టేషన్లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఈ నెల 16వ తేదీన ఎంవిపి.కాలనీ సెక్టార్- 3లో కె.శామ్యూల్ అనిల్ కుమార్ ఇంటిలో జరిగిన దొంగతనం కేసులో జోడుగుళ్లపాలేనికి చెందిన వాసుపల్లి నరసింగరావును అదుపులోకి తీసుకుని విచారించామన్నారు. నిందితుడు అపహరించిన రూ.61,700 విలువ చేసే సొత్తు, 55 ఇంచుల సోనీ బ్రేవియ టివి, ఫేబర్ నాలుగు బర్నర్ల గ్యాస్ స్టవ్‌ను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ఈ కేసును ఛేదించి నిందితున్ని అరెస్టు చేయడంలో క్రైమ్ సిఐ వి.చక్రధరరావు, ఎస్ఐ ఎం.అప్పలరాజు, ఎఎస్ఐ డి.కిషోర్ బాబు, కానిస్టేబుళ్ల పి.అప్పలరాజు, అగస్టిన్ తదితరులు పని చేశారన్నారు.

విద్యార్థిని ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి -తగరపువలస : స్థానిక గోస్తనీ వంతెన పై నుంచి సోమవారం సాయంత్రం నదిలో దూకి ఆత్మ హత్యకు యత్నించిన ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థినిని స్నేహితులు వెంటనే ప్రాణాపాయం నుంచి కాపాడారు. భీమిలి సిఐ సుధాకర్ కథనం ప్రకారం... ఛాతి సంబంధిత సమస్యతో కొంత కాలంగా తండ్రి బాధపడుతూ ఉండడం, అనారోగ్యంతో తల్లి మంచం పట్టి ఉండడంతో తీవ్ర మనో వేదనకు గురైన కుమార్తె నదిలో దూకి ఆత్మ హత్యకు ప్రయత్నించింది. ఆత్మ హత్యకు పాల్పడిన విద్యార్థిని సొంతూరు భోగాపురం మండల పరిధిలో ఉంది. స్నేహితుల సాయంతో ఇంటికి చేరిన తమ కుమార్తె బాగానే ఉన్నట్లు ఆమె తల్లిదండ్రులు తెలిపారు.

వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి- కోటవురట్ల:మండలంలో రత్నాల పాలెం గ్రామానికి చెందిన బుంగ అప్పారావు (50) అనే వ్యక్తి సోమవారం ఉదయం గడ్డి మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికులు స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు తరలించారు. చికిత్స పొందుతూ అప్పారావు మృతి చెందాడు. స్థానిక ఎస్సై రమేష్ ఇచ్చిన వివరాలు ఇలా ఉన్నాయి నిత్యం మద్యం సేవిస్తూ ఉండడంతో భార్య మందలించిందని గడ్డి మందు తాగినట్లు తెలిపారు. మృతుడు అప్పారావు కి ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నట్లు తెలిసింది. మృతుడు రిక్షా లాగుతూ జీవనం సాగిస్తుండేవాడు.

మద్యం సీసాలు పట్టివేత

ప్రజాశక్తి-ఎస్.రాయవరం:మండలంలోని మత్స్యకార గ్రామమైన బంగారమ్మపాలెం గ్రామానికి అక్రమంగా తరలిస్తున్న సుమారు నలభై మద్యం కేసులను గ్రామస్తులు పట్టుకున్నారు. సోమవారం ఉదయం గుడివాడ మద్యం దుకాణం నుండి ఆటోలో తరలిస్తుండగా గ్రామస్తులు పట్టుకుని స్థానిక పోలీసులకు, ఎక్సైజ్ అధికారులకు సమాచార మందించారు. ఈ మేరకు జిల్లా యస్పీకి ఫోన్‌లో సమాచారమందించినట్లు తెలిపారు.

బాలికపై అత్యాచారం కేసులో నిందితుడు అరెస్ట్

ప్రజాశక్తి - యలమంచిలి : యలమంచిలి మున్సిపాలిటీ గాంధీనగర్‌కు చెందిన 13ఏళ్ల బాలికను అత్యాచారం చేసిన ఆరోపణలతో మున్సిపాలిటీ పరిధి ఉల్కిపేటకు చెందిన మళ్ల రూపేష్‌ను అరెస్టు చేసినట్లు పరవాడ డిఎస్‌పి స్వరూప్ తెలిపారు. సోమవారం పట్టణ పోలీసు స్టేషనులో విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ, బాలికను భయపెట్టి అత్యాచారం చేసిన ఘటనలో బాధితురాలి తల్లి ఫిర్యాదు మేరకు నిందితుడిపై పోక్సో చట్టంతోపాటు ఐటి యాక్ట్ కింద టౌన్ పిఎస్ కేసు నమోదు చేసి దర్యాప్తు అనంతరం నిందితుడిని అరెస్ట్ చేశామన్నారు.


లోకేష్‌కు వినతిపత్రం అందజేస్తున్న అప్పా రాష్ట్ర నాయకులు

ఫారం 1పై గడువు పెంచాలని వినతి

ప్రజాశక్తి -గాజువాక : ఫారం-1పై గడువును నెలరోజులు పెంచాలని కోరుతూ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌కు అప్పా రాష్ట్ర నాయకులు సోమవారం వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వం ఫారం- 1 విడుదల చేసి ప్రైవేట్ పాఠశాలల పూర్తి వివరాలు ఆన్‌లైన్‌లో ఈ నెల 31వ తేదీలోగా పంపించాలని కోరిందని, పంపించాల్సిన వివరాలలో కొన్నింటిపై అభ్యంతరాలున్నందున గడువు పెంచాలని కోరారు. దీనికి మంత్రి లోకేష్ స్పందిస్తూ గడువు పెంచుతానని హామీ ఇచ్చారని అప్పా నాయకులు తెలిపారు. విద్యాశాఖ మంత్రిని కలిసిన వారిలో అప్పా గౌరవాధ్యక్షుడు మెట్ట జనార్దన్, రాష్ట్ర ఫైనాన్సియల్ సెక్రటరీ పి.భాస్కరరావు, అప్పలనాయుడు ఉన్నారు.


ముగింపు సదస్సులో మాట్లాడుతున్న ఇపిఎస్.భాగ్యలక్ష్మి

రాజ్యాంగ లక్ష్యాల సాధనకు కృషి

ప్రజాశక్తి -ములగాడ : రాజ్యాంగ లక్ష్యాలైన సార్వభౌమాధికారం, సామ్యవాదం, లౌకిక తత్వం, ప్రజాస్వామ్యం, గణతంత్ర, న్యాయం, స్వేచ్ఛ, సమానత్వం, సోదరభావం, వ్యక్తి ఆత్మగౌరవం, దేశ ఐక్యత మొదలైన వాటిని సాధించడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జాతీయ సేవా పథకం జిల్లా ప్రోగ్రామ్ అధికారి ఇపిఎస్.భాగ్యలక్ష్మి కోరారు. స్థానిక సెయింట్ ఆన్స్ కళాశాలలో రెండు రోజులుగా 'రాజ్యాంగ పరిరక్షణలో యువత పాత్ర' అనే అంశంపై నిర్వహిస్తున్న సదస్సు సోమవారం ముగిసింది. ఈ సదస్సులో ఆమె మాట్లాడుతూ, ఎవరు ఏ వృత్తిలో ఉన్నప్పటికీ అంతా రాజ్యాంగ లక్ష్యాల సాధనకు కృషి చేయాలన్నారు. దేశాభివృద్ధికి యువతరం రాజ్యాంగాన్ని తప్పక తెలుసుకోవాలని, రాజ్యాంగబద్ధంగా జీవించడానికి అలవాటు పడాలని సూచించారు. సేవ, త్యాగం, నిజాయతీ, పట్టుదల, క్రమశిక్షణను యువత అలవరుచుకున్నప్పుడే భారతదేశం గొప్ప దేశం కాగలదన్నారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సిస్టర్ ప్రేమ కుమారి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు. అనంతరం సదస్సులో ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులను అందజేశారు.

52వ వార్డులో జియ్యాని పర్యటన

ప్రజాశక్తి -కరాస: జివిఎంసి 52వ వార్డులో డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ సోమవారం పర్యటించారు. గోరీనగర్ ప్రాంతంలో పారిశుధ్యం, తాగునీరు తదితర సమస్యలపై స్థానికుల నుంచి వచ్చిన వినతుల మేరకు ఆయా ప్రాంతాలను పారిశుధ్య అధికారులతో కలిసి పరిశీలించారు. అనంతరం కరాస ప్రాంతాల్లో సిసి రోడ్ల నిర్మాణాలను, పార్కుల పరిస్థితులను పరిశీలించారు. స్థానికులను అక్కడి సమస్యలనడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎఇ ఉష, వర్క్ ఇన్‌స్పెక్టర్ బాలకృష్ణ, సెక్రటరీ అనూప్ తదితరులు పాల్గొన్నారు.


52వ వార్డులో సమస్యలనడిగి తెలుసుకుంటున్న శ్రీధర్

కేంద్ర ప్రభుత్వ విధానాలతోనే ప్రమాదాలు

ప్రజాశక్తి -గోపాలపట్నం : రక్షణ, రైల్వే, ప్రభుత్వ రంగ సంస్థల్లో ప్రమాదాలకు కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రైవేటీకరణ, కాంట్రాక్టీకరణ విధానాలే కారణమని డిఫెన్స్ కో-ఆర్డినేషన్ కమిటీ చైర్మన్ రెడ్డి వెంకటరావు అన్నారు. ఎన్ఎడి సత్యాగ్రహ దీక్ష శిబిరం వద్ద ఎన్ఎడి సివిల్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యాన మహారాష్ట్ర బండారాలోని ఆర్డినెన్స్ ఫ్యాక్టరీలో జరిగిన బ్లాస్టింగ్‌లో చనిపోయిన ఎనిమిది మంది కార్మికులకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా రెడ్డి వెంకటరావు మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం రక్షణ రంగ సంస్థల్లో 100 శాతం విదేశీ పెట్టుబడులను అనుమతించడంతోపాటు, బ్రిటిష్ కాలం నాటి ఆర్డినెన్స్ ఫ్యాక్టరీలను కార్పొరేటీకరణ, ప్రైవేటీకరణ చేస్తోందని, కాంట్రాక్టీకరణ, ఆఫ్ లోడింగ్ విపరీతంగా పెరిగిందని, ఈ విధానాలే ప్రమాదానికి కారణమవుతున్నాయని వివరించారు. రక్షణ రంగంలో సుమారు రెండు లక్షల ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని, వీటిని భర్తీచేయకుండా పనులను ప్రైవేటుకు అప్పగిస్తున్నారని, ఇది దేశ భద్రతకు, రక్షణకు తీవ్రమైన హాని చేస్తుందని తెలిపారు. ఈ విధానాలకు వ్యతిరేకంగా పోరాడుతున్న కార్మికవర్గాన్ని అణిచివేయడం కోసమే చట్టాలలో మార్పు చేస్తుందన్నారు. రక్షణ రంగంలో సమ్మెలను నిషేధించడంతోపాటు, సమస్యలపై నిలదీస్తున్న యూనియన్ నాయకులపైనా, కార్యకర్తలపైనా కక్ష సాధింపు చర్యలకు దిగుతుందని చెప్పారు. అందులో భాగంగానే ఎన్ఎడిలో 36 మందిని సస్పెండ్ చేసి, డాక్ యార్డులో 46 మందికి వార్నింగ్ లెటర్ ఇచ్చి కార్మికులను భయపెట్టాలని చూస్తుందని, వీటిని ఐక్య ఉద్యమాల ద్వారా ఎదుర్కోవాలని పిలుపునిచ్చారు. ఎన్ఎడి యూనియన్ ప్రధాన కార్యదర్శి ఆర్.శ్రీనివాస్ మాట్లాడుతూ, ఎన్ఎడిలో పని భారం విపరీతంగా పెరిగిందని, దాన్ని అధిగమించడం కోసం కార్మికులతో ఓవర్ టైం చేయించారని, ఆ డబ్బులు అడిగామని కక్ష సాధింపు చర్యలకు యాజమాన్యం దిగిందని చెప్పారు. ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షులు నూకరాజు, వర్క్స్ కమిటీ చైర్మన్ డి.వి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ ప్రమాద మృతులకు నివాళులర్పిస్తున్న నాయకులు

కాళ్లరిగేలా తిరుగుతున్నాం.. కనికరించండి

భానోజీతోట టిడ్కో గృహ లబ్ధిదారుల వినతి



గాజువాక జోనల్ కార్యాలయానికి వచ్చిన లబ్ధిదారులు

ప్రజాశక్తి -గాజువాక : 'కాళ్లు అరిగేలా తిరుగుతున్నాం.. కనికరించండి' అని భానోజీతోట టిడ్కో గృహ లబ్ధిదారులు సోమవారం గాజువాక జోనల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. సోమవారం లబ్ధిదారులు అందరూ జోనల్ కార్యాలయం చేరుకొని అధికారులను కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, భానోజీతోట టిడ్కో లబ్ధిదారులు మొత్తం 700 మంది ఉన్నామని తెలిపారు. ఏడు సంవత్సరాల క్రితం ఎ, బి, సి మూడు విభాగాలుగా విభజించి గృహాలు కేటాయించినా నేటికీ అలాట్‌మెంట్ కాపీని అందజేయలేదని ఆవేదన వ్యక్తంచేశారు. రెండేళ్ల క్రితం లబ్ధిదారులందరికీ రుణాలు మంజూరు చేస్తున్నట్లు బ్యాంకులు తెలిపాయి. గృహాలు అప్పజెప్పలేదుకానీ బ్యాంకుల నుంచి ఇఎంఐలు కట్టాలని ఒత్తిడి చేస్తున్నట్లు తెలిపారు. సొంత గృహం రాక, మరోపక్క ఇంటి అద్దెలు చెల్లిస్తూ భారంగా బతుకులు వెళ్లదీస్తున్నామని ఆవేదన వ్యక్తంచేశారు. ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నామన్నారు. రోడ్లు, కాలువలు అభివృద్ధి చేసి తక్షణమే ఇళ్లను అప్పగించాలని కోరారు.

'విజయసాయిరెడ్డి రూ.వేల కోట్లు దోపిడీ'

ప్రజాశక్తి-సీతమ్మధార : రాజ్యసభ మాజీ సభ్యులు విజయసాయిరెడ్డి రూ.వేల కోట్లు దోచుకున్నారని జనసేన కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్ ఆరోపించారు. సోమవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, వైసిపి ఉత్తరాంధ్ర ప్రతినిధిగా ఉంటూ పేదల భూములు, ప్రయివేటు, ప్రభుత్వ ఆస్తులు వేల ఎకరాలను కబ్జా చేశారని ఆరోపించారు. విజయసాయిరెడ్డిపై కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు.

పిజిఆర్ఎస్‌కు వినతులు

ప్రజాశక్తి-యంత్రాంగం

సీతమ్మధార : జివిఎంసి జోన్- 3 కార్యాలయంలో నిర్వహించిన ప్రజా వేదికకు మూడు అర్జీలు వచ్చినట్లు జోనల్ కమిషనర్ శివప్రసాద్ తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. అర్బన్ తహశీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా వేదికకు 6 అర్జీలు వచ్చినట్లు తహశీల్దార్ రమేష్‌బాబు తెలిపారు.

భీమునిపట్నం : జివిఎంసి ఒకటో జోన్ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పిజిఆర్ఎస్)కు 7 అర్జీలు అందాయి. ఇందులో పట్టణ ప్రణాళిక, రెవెన్యూ విభాగాలకు సంబంధించి చెరొక అర్జీ, ఇంజినీరింగ్ విభాగానికి సంబంధించి 5 అర్జీలు అందినట్లు జోనల్ కమిషనర్ పిల్లి ప్రేమ ప్రసన్నవాణి తెలిపారు. తదుపరి చర్యల నిమిత్తం అర్జీలను ఆయా విభాగాల అధికారులకు పంపించినట్లు ఆమె తెలిపారు

మందుబాబులకు అపరాధ రుసుం

ప్రజాశక్తి -మధురవాడ : పిఎం.పాలెం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో మద్యం తాగి వాహనాలు నడిపిన వారికి అపరాధ రుసుం విధించినట్లు నార్త్ జోన్ సబ్ డివిజన్ ట్రాఫిక్ సిఐ ఎన్.సాయి తెలిపారు. మద్యం తాగి వాహనాలు నడిపిన 11 మందిని స్పెషల్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ కోర్టులో హాజరు పరచగా రూ.10 వేల నుంచి రూ.12,500 చొప్పున రూ.1,19,500 అపరాధ రుసుం విధించినట్లు సిఐ తెలిపారు.

జిల్లా పరిషత్ వసతి గృహాల పరిశీలన

ప్రజాశక్తి -గోపాలపట్నం : గోపాలపట్నం రైల్వే స్టేషన్ సమీపంలోని జిల్లా ప్రజా పరిషత్ ఆస్తులైన యాత్రికుల వసతి గృహం, చుట్టూ ఉన్న ఆక్రమణలను జిల్లా ప్రజా పరిషత్ చైర్‌పర్సన్ జె.సుభద్ర, ముఖ్య కార్యనిర్వహణాధికారి పి.నారాయణమూర్తి సోమవారం పరిశీలించారు. అనంతరం జిల్లా ప్రజా పరిషత్ బాలుర, బాలికల పాఠశాలలను సందర్శించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులతో ముఖాముఖి సంభాషించారు. పాఠశాలలో వున్న మరుగుదొడ్లను పరిశీలించారు. జిల్లా క్రీడా సముదాయంలోని క్రీడా మైదానాన్ని సందర్శించి, వ్యాయామ ఉపాధ్యాయులతో క్రీడా కార్యకలాపాల గురించి అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించి ప్రతిభా పాటవాలను పరిశీలించారు. మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును పరిశీలించారు. తదుపరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు సంబంధించి ఆక్రమణకు గురైన జిల్లా పరిషత్ స్థలంలో నిర్మించిన షాపింగ్ మాల్‌ను పరిశీలించారు.


గోపాలపట్నంలో జిల్లా పరిషత్ ఆస్తులను పరిశీలిస్తున్నసుభద్ర తదితరులు

పురుషోత్తమపురంలో జిల్లా పరిషత్‌కు ఉన్న ఖాళీ భూమిని పరిశీలించి రక్షణకు చేపట్టాల్సిన చర్యలపై చర్చించారు. సింహాచలం పాఠశాల వద్ద, అడివివరం బిఆర్‌టిఎస్ రోడ్డు వెడల్పులో తొలగించిన గెస్ట్ హౌస్ స్థలాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పెందుర్తి ఎంపిడిఒ కొల్లి వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

678 యూనిట్ల రక్తం సేకరణ

ప్రజాశక్తి -ములగాడ : పివిఎస్ హెల్పింగ్ హ్యాండ్స్ చారిటబుల్ ట్రస్టు 9వ వార్షికోత్సవం సందర్భంగా ఏర్పాటుచేసిన మెగా రక్తదాన శిబిరం ద్వారా 678 యూనిట్ల రక్తాన్ని సేకరించారు. తొలుత ట్రస్టు వ్యవస్థాపకులు డాక్టర్ పివి.సురేష్ రక్తదానం చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. రోటరీ, లయన్స్, విజయశ్రీ, ఎన్‌టిఆర్, అమ్మ, మదర్, వందేభారత్, ఛత్రపతి శివాజీ, ఫస్ట్, సంజీవని, లైఫ్ షేర్ బ్లడ్ బ్యాంకుల సహకారంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో రక్తదాతలు పాల్గొని 678 యూనిట్ల రక్తాన్ని అందజేశారు. ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన పివి.సురేష్‌ను రాజకీయాలకతీతంగా పలువురు అభినందించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, మేయర్ గొలగాని హరివెంకటకుమారి, మాజీ ఎమ్మెల్యేలు మళ్ల విజయప్రసాద్, చింతలపూడి వెంకటరామయ్య, నాయకులు తిప్పల దేవన్‌రెడ్డి, బెహరా భాస్కరరావు తదితరులు పాల్గొని రక్తదాతలకు జ్ఞాపికలను అందజేశారు.


రక్తదాతలకు ప్రశంసాపత్రాలను అందిస్తున్న పివి.సురేష్

నిత్యావసరాల ధరలను నియంత్రించాలి

కలెక్టరేట్ వద్ద ఐద్వా ఆధ్వర్యాన ధర్నా : జాయింట్ కలెక్టర్ జాహ్నవికి వినతిపత్రం అందజేత



కలెక్టరేట్ ముందు ధర్నా చేస్తున్న ఐద్వా నేతలు

ప్రజాశక్తి-అనకాపల్లి : రాష్ట్రంలో పెరుగుతున్న ధరలపై నియంత్రణ చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమవారం ఐద్వా ఆధ్వర్యంలో కలెక్టరేట్ ముందు ధర్నా నిర్వహించి, జెసి జాహ్నవికి వినతి పత్రం అందజేశారు.. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షురాలు బి ప్రభావతి, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు పి. మాణిక్యం, డిడి వరలక్ష్మి మాట్లాడుతూ ధరల నియంత్రణపై దేశ వ్యాప్తంగా తమ ఆందోళనను రాష్ట్ర పతికి, ప్రధానికి తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నామన్నారు. కేంద్ర ప్రభుత్వ ఆర్థిక విధానాలు, నియంత్రణలో పెనుమార్పులు పేద ప్రజలపై ఒత్తిడిని మరింత తీవ్రతరం చేశాయన్నారు. కన్స్యూమర్ ప్రైస్ ఇండెక్స్ (సిపిఐ) హోల్‌సేల్ ప్రైస్ ఇండెక్స్ (డబ్ల్యు పి ఐ)ల్లో నమోదైన పెరుగుదల ఈ పరిస్థితిని ప్రతిబింబిస్తోందన్నారు. ఆహార ఉత్పత్తులు, పెట్రోల్, గ్యాస్ వంటి అవసరమైన వస్తువుల ధరల పెరుగుదల వల్ల కుటుంబ ఖర్చులు సాధారణ ప్రజల ఆదాయాలను మించుతున్నాయని, జిఎస్‌టి భారాలు మరింత పెంచారన్నారు. ప్రభుత్వ పౌర సరఫరా వ్యవస్థ ద్వారా ఆహారధాన్యాలు, ఇతర నిత్యావసర వస్తువులను తక్కువధరలకు అందుబాటులో ఉంచాలని, ఉపాధి హామీ పని దినాలను 200 రోజులకు పెంచి, కనీస వేతనాలను హామీని అమలు చేయాలని, మెరుగైన ఆరోగ్య సేవలు అందించేందుకు సబ్సిడీల కొనసాగింపు, ఆరోగ్యశ్రీ సేవలకు నిధులు ఇచ్చి ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్య సేవలు మెరుగు చేయాలన్నారు. విద్యా హక్కు చట్టాన్ని అమలు చేయడం,.బాలికల విద్యపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వ వాగ్దానం మేరకు కందిపప్పు, వంటనూనె తక్షణం అందరికీ అందించాలని, నగదు బదిలీ కాకుండా వాగ్దానం మేరకు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా అందించాలని, రేషన్ కార్డులో అవసరమైన మార్పులుచేయాలని డిమాండ్ చేశారు. ధరల నియంత్రణపై ఐద్వా ఆధ్వర్యంలో ఏడు మండలాల్లో రెండువేల సంతకాలు సేకరణ చేపట్టామన్నారు. కార్యక్రమంలో సహాయ కార్యదర్శి ఆర్ లక్ష్మి, జిల్లా కమిటీ సభ్యులు మంగ పాల్గొన్నారు.

గీత కార్మిక సొసైటీలకే మద్యం షాపులు కేటాయించాలి



ధర్నా చేస్తున్న గీత కార్మికులు, నేతలు

ప్రజాశక్తి - యలమంచిలి : జిఒ13 రద్దుచేసి, గీత కార్మికులకు కేటాయించిన మద్యం దుకాణాలను ఆయా కులాల సహకార సొసైటీలకు మాత్రమే కేటాయించాలని డిమాండ్ చేస్తూ యలమంచిలిలో గీత కార్మికులు సోమవారం మెయిన్‌రోడ్డులోనూ, తహశీల్దార్ కార్యాలయం ముందు ధర్నా చేపట్టారు. తహశీల్దార్ కార్యాలయంలో వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా గీత సహకార సంఘాల సమాఖ్య జిల్లా కన్వీనరు పెంకె మారేసు మాట్లాడుతూ జిఒ 13తో గీత కార్మికులకు నష్టం జరుగుతుందని,బినామీ పేర్లతో మద్యం షాపులు తరలించుకుపోయే ప్రమాదం ఉందన్నారు. గీత కార్మికులకు కేటాయించిన 10 శాతం మద్యం షాపులను వ్యక్తులకు కాకుండా సహకార సొసైటీలకు కేటాయించాలని డిమాండ్ చేశారు.కార్యక్రమంలో యలమంచిలి నియోజకవర్గం యాతకుల సంక్షేమ సంఘం కో కన్వీనర్ పిల్లి శ్రీనివాస్, నాయకులు దొడ్డి వెంకటేష్, దుంగా బంగారి, రాంబిల్లి మండల యేత సంక్షేమ సంఘం అధ్యక్షుడు రంగల నాగరాజు, దుంగా అప్పారావు, అనసూరి మోహనరావు, పూడి మారేసు, టిసిఎస్ మాజీ అధ్యక్షుడు ఎల్లంకుల సూరిబాబు, అప్పలనాయుడు, గోవిందు పాల్గొన్నారు.

పిజిఆర్ఎస్‌కు 214 అర్జీలు


అర్జీలుస్వీకరిస్తున్న డిఆర్ఒ, జెసి


ప్రజాశక్తి-అనకాపల్లి : వ్యక్తిగత, సామాజిక సమస్యలపై ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్)లో 214 అర్జీలు వచ్చాయి. సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో జాయింటు కలెక్టరు ఎమ్.జాహ్నవి, డిఆర్ఒ సత్యనారాయణరావు, హౌసింగు పీడీ శ్రీనివాసరావు, ఎస్‌డిసి. మనోరమ ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. స్వీకరించిన అర్జీలను సత్వరమే పరిష్కరించాలని అధికారులను జెసి జాహ్నవి ఆదేశించారు. మండల కార్యాలయాల్లో పిజిఆర్ఎస్ నిర్వహిస్తున్న విషయాన్ని గ్రామ స్థాయిలో సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు.కార్యక్రమంలో జిల్లా అధికారులు పాల్గొన్నారు. అర్జీలలో 128 రెవెన్యూ, 23 పంచాయతీరాజ్, సర్వే సెటిల్మెంట్స్ 13, పోలీస్ హౌసింగ్ రిజిస్ట్రేషన్ తదితర సమస్యలకు సంబంధించి అర్జీలు వచ్చాయి.

పోలీస్ పిజిఆర్ఎస్‌కు 32 ఫిర్యాదులు

జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 32 ఫిర్యాదులు వచ్చాయి. ఆస్తి తగాదాలు, కుటుంబ కలహాలు, చీటింగ్ తదితర సమస్యలు వచ్చాయి. జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా ఆదేశాల మేరకు, అదనపు ఎస్‌పి ఎం. దేవ ప్రసాద్ నేరుగా ఫిర్యాదుదారుల నుంచి అర్జీలను స్వీకరించి, వారితో ముఖాముఖిగా మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఫిర్యాదులన్నింటిపైనా చట్టపరంగా విచారణ జరిపి బాధితులకు న్యాయం చేస్తామని, హామీ ఇచ్చారు. ఎస్ఐ డి.వెంకన్న పాల్గొన్నారు.

లోకేష్‌ను కలిసిన నేతలు

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట: విశాఖపట్నం వచ్చిన తెలుగుదేశం పార్టీ యువ నాయకులు, ఐటి, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌ను విశాఖ విమానాశ్రయంలో రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ చైర్మన్, అనకాపల్లి జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు బత్తుల తాతయ్యబాబు మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి, సాదరంగా స్వాగతించారు.


నారా లోకేష్‌ను పుష్పగుచ్ఛంతో స్వాగతిస్తున్న తాతయ్యబాబు

డంపింగ్ యార్డ్‌తో బేజారు.!

తరలించాలని తుమ్మపాల, పరిసర గ్రామాల ప్రజల ఆందోళన


డంపింగ్ యార్డ్ వద్ద నిరసన తెలుపుతున్న గ్రామస్తులు

ప్రజాశక్తి -అనకాపల్లి : అనకాపల్లి పట్టణానికి కూత వేటు దూరంలో ఉన్న మేజర్ పంచాయతీ తుమ్మపాల గ్రామం మెయిన్ రోడ్డును అనుకొని ఉన్న డంపింగ్ యార్డ్ నుంచి చెత్తను ఎప్పటికప్పుడు తరలించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమవారం గ్రామస్తులు నిరసన చేపట్టారు. తుమ్మపాలతో పాటు బగులవాడ, దిబ్బపాలెం, చోడవరం రోడ్ల వెళ్లే ప్రయాణికులు డంపింగ్ యార్డ్ నుంచి వస్తున్న దుర్గంధం వల్ల తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. అలాగే వర్షాకాలంలో డంపింగ్ యార్డ్ పూర్తి దుర్గంధం, ఇక్కడ వేసిన పందులు కుక్కల కళేబరాలతో పరిసరాల్లో ప్రజలు జీవించలేని పరిస్థితి ఉందన్నారు. ప్రతి శనివారం ఇక్కడ పశువుల సంత, సంత జరగడంతో పరిసర గ్రామాల నుంచి అధిక సంఖ్యలో సరుకులు కొనుగోలు చేసేందుకు వచ్చే ప్రజలు కూడా తీవ్ర అవస్థలు పడుతున్నారన్నారు. తరచూ పరిసరాల ప్రజలు డయేరియా, జ్వరాల బారిన పడడం జరుగుతుందన్నారు. అలాగే 150 ఏళ్ల చరిత్ర ఉన్న పోలమాంబ ఆలయానికి వచ్చే భక్తులు వచ్చేందుకు ఇబ్బందులు పడుతున్నారన్నారు. తక్షణమే జిల్లా పంచాయతీ అధికారులు, ఎంపిడిఒ, స్థానిక పంచాయితీ పాలకవర్గం డంపింగ్ యార్డ్ నుంచి చెత్తను ఎప్పటికప్పుడు తరలించే చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో గ్రామస్తులు బొడ్డపాటి చిన్న రాజారావు, బొడ్డపాటి అప్పలనాయుడు, కోన అప్పారావు, కర్రి కోటేశ్వరరావు, బుదిరెడ్డి అప్పారావు, కనుబుద్ది సూరిబాబు పాల్గొన్నారు.

అత్యాచార నిందితుడిని కఠినంగా శిక్షించాలి

సిఐటియు, ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ డిమాండ్



మాట్లాడుతున్న ప్రజాసంఘాల నేతలు

ప్రజాశక్తి - యలమంచిలి : ఎలమంచిలిలో 13ఏళ్ల బాలికపై అత్యాచారఘటనపై పక్క నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్న హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత ఇంతవరకు స్పందించకపోవడం విచారకరమని సిఐటియు, ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ నేతలు అసంతృప్తి వ్యక్తం చేశారు. సోమవారం అత్యాచార ఘటనను ఖండించిన సిఐటియు మండల కార్యదర్శి సిహెచ్ శివాజీ, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు బాలాజీ మాట్లాడుతూ మైనర్ బాలికపై అత్యాచారం కేసులో నిందితుడ్ని 24గంటల్లోనే అరెస్ట్ చేశామని చెప్పుకుంటున్న పోలీసులు, దీనిపై ఫాస్ట్‌ట్రాక్ కోర్టులో విచారణ జరిపి నిందితుడికి త్వరగా శిక్ష పడేట్టు చేయాలని కోరారు.కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐజిల్లా ఉపాధ్యక్షుడు అభి, డివైఎఫ్ఐ నాయకులు పాల్గొన్నారు.

పరమేశ్వరరావును పరామర్శించిన ఎమ్మెల్యే

ప్రజాశక్తి- కశింకోట :బిజెపి జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు దంపతులను స్థానిక ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ సోమవారం పరామర్శించారు. పరమేశ్వరావు అత్త పడాల అమ్మాజీ ఇటీవల మరణించిన విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కొణతాల సోమవారం వారి ఇంటికి వెళ్లి పరమేశ్వర రావు దంపతులను పరామర్శించారు. పరామర్శించిన వారిలో కూటమి నాయకులు తదితరులున్నారు.


పరమేశ్వరరావు దంపతులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే కొణతాల

కల్లు గీత కులాల మద్యం దుకాణాలకు 5లోగా దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి- అనకాపల్లి : జిల్లాలో కల్లుగీత కులాలకు కేటాయించిన 15 మద్యం షాపులకు వచ్చేనెల 5లోగా దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి వి సుధీర్ సోమవారం ఒక ప్రకటనలో కోరారు. ఇప్పటికే నోటిఫికేషన్ విడుదలచేశామన్నారు. జిల్లాలో గౌడ, గౌడ్, శెట్టిబలిజ, యాత ఉప కులాలకు చెందిన గౌడలకు ఒకటి, గౌడ్‌లకు ఒకటి, శెట్టిబలిజలకు తొమ్మిది, యాతలకు నాలుగు దుకాణాలను కేటాయించామని, జిల్లా కలెక్టర్ సమక్షంలో లాటరీ ద్వారా కేటాయిస్తామన్నారు. దరఖాస్తుతోపాటు విధిగా ఉప కులంతో కూడిన కుల ధ్రువీకరణ పత్రం జతచేయాలన్నారు. ఫిబ్రవరి 5, సాయంత్రం ఐదు గంటలలోగా దరఖాస్తులను సంబంధిత అనకాపల్లి, ఎలమంచిలి, చోడవరం, పాయకరావుపేట నర్సీపట్నం గోలుగొండ, వి.మాడుగుల మండలాల్లో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ సమర్పించాలన్నారు.

ఇవిఎం గోదాముల తనిఖీ


గోదామును తనిఖీ చేస్తున్న డిఆర్ఒ, రాజకీయ నేతలు

ప్రజాశక్తి- అనకాపల్లి : కలెక్టరేట్ సమీపంలో ఉన్న ఇవిఎం గోదామును సోమవారం జిల్లా రెవెన్యూ అధికారి వై సత్యనారాయణరావు తనిఖీ చేశారు. నెలవారీ తనిఖీల్లో భాగంగా జిల్లా ఎస్.పి. కార్యాలయం ఆవరణలో ఇవిఎం గోడౌనును వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో తనిఖీ చేసిన డిఆర్ఒ, అక్కడ భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. సీసీ కెమెరాల పనితీరును, ప్రధాన ద్వారానికి ఉన్న సీళ్లను పరిశీలించారు. కార్యక్రమంలో ఎలక్షన్ సెక్షను సూపరింటెండెంటు వాసు, ఉపతహసీల్దార్ రవి కుమార్, అనకాపల్లి ఎలక్షన్ డిటి వి.రాజ్యలక్ష్మి, స్టేషన్ ఫైర్ ఆఫీసర్, పి నాగేశ్వరరావు, తెలుగుదేశం పార్టీ ప్రతినిధి బి.శ్రీనివాసరావు, బిజెపి ప్రతినిధి పి.నాగేశ్వరరావు, వైసిపి ప్రతినిధి టి.షణ్ముఖ, ఐఎన్ సి ప్రతినిధి టి రమణ, ఆప్ పార్టీ ప్రతినిధి కె.హరినాధబాబు పాల్గొన్నారు.

ఫీ'జులుం'ను అరికట్టాలి

విద్యార్థుల ఆత్మహత్యలు నివారించాలి :వామపక్ష విద్యార్థి సంఘాల ఐక్యవేదిక ధర్నా

ప్రజాశక్తి-అనకాపల్లి : ఫీజుల పేరుతో విద్యార్థులను ఇబ్బంది పెడుతున్న ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని, విద్యార్థుల ఆత్మహత్యలు నివారించాలని వామపక్ష విద్యార్థి సంఘాల ఐక్యవేదిక డిమాండ్‌చేసింది. సోమవారం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. ప్రైవేట్, కార్పొరేట్ కాలేజీలు ఫీజుల దోపిడీతో విద్యార్థులు బలవన్మరణాల ఘటనలపై చర్యలు తీసుకోవాలని ఇచ్చిన పిలుపులో భాగంగా అనకాపల్లి జిల్లా కలెక్టర్ ఆఫీసు వద్ద ఎస్ఎఫ్ఐ, పిడిఎస్ఒ, ఎఐఎస్ఎఫ్ విద్యార్థి సంఘాలతో ఐక్యవేదిక ఆధ్వర్యంలో రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఆందోళన చేపట్టి, జాయింట్ కలెక్టర్ జాహ్నవికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పిడిఎస్ఒ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.భాస్కర్, ఎఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.ఫణీంద్ర, ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.రమణ మాట్లాడుతూ పరీక్షలు సమీపిస్తున్న తరుణంలో రాష్ట్ర వ్యాప్తంగా అనేక ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలు విద్యార్థుల నుంచి ఫీజులు వసూలు చేయాలనే ఉద్దేశంతో విద్యార్థులపై అధిక ఒత్తిడికి గురి చేయడం సమంజసం కాదన్నారు అటు పరీక్షల టెన్షన్,ఇటు ఫీజులు పేరుతో విద్యాసంస్థల యాజమాన్యాలు చేస్తున్న ఒత్తిడిని, ఫీజులుకట్టుకోలేని స్థితిలో విద్యార్థుల్ని మానసిక వేదనకు గురవుతున్నారని, పర్యావసానంగా రాష్ట్రంలో వరుసగా ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇటీవల అనంతపురంలో జరిగిన సంఘటన ఉదాహరణ అన్నారు. ఈ సంఘటనలపై విద్యార్థి ఆత్మహత్యలపై ప్రభుత్వం, విద్యాశాఖ మంత్రి తక్షణమే స్పందించాలని, వరుసగా జరుగుతున్న విద్యార్థుల ఆత్మహత్యలపై ఒక విచారణ కమిటీ వేసి ఆయా యాజమాన్యాలపై క్రిమినల్ చర్యలు చేపట్టి విద్యార్థులకు న్యాయం చేయాలని కోరారు. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఫీజుల దోపిడీని అరికడుతూ, హేతుబద్ధమైన ఫీజుల విధానాన్ని నిర్ణయించి అన్ని ప్రైవేట్,కార్పొరేట్ కాలేజీల్లో అమలు చేయాలని డిమాండ్ చేశారు. దీనిపై ఆయా విద్యాసంస్థలకు సర్క్యులర్‌లను పంపి, నోటీసు బోర్డులో పెట్టించాలని డిమాండ్ చేశారు.



ధర్నా చేస్తున్న వామపక్ష విద్యార్థి సంఘాల ఐక్యవేదిక

గ్రావెల్ దందాపై చర్యలు తీసుకోండి

ప్రజాశక్తి -రాంబిల్లి: మండల కేంద్రమైన, రాంబిల్లి పంచాయితీ శివారు కొండలదేవుని పాలెం గ్రామాన్ని ఆనుకొని ఉన్న కొండనుంచి కొంతమంది అక్రమంగా గ్రావెల్ దందా నడుపుతున్నారని సిపిఎం మండల కార్యదర్శి జి దేవుడు నాయుడు ఆరోపించారు. అధికారాన్ని అడ్డంపెట్టుకుని, పేదల డీపట్టా భూముల్లో రాత్రి వేళల్లో ప్రొక్లెయినర్లతో తవ్వి, ట్రాక్టర్లతో గ్రావెల్ తరలించుకుపోతున్నారన్నారు. సోమవారం అక్రమంగా గ్రావెల్ తవ్వకాలు ప్రదేశాన్ని పరిశీలించారు. రాంబిల్లి మండల రెవెన్యూ అధికారులకు, పోలీసులకు సమాచారమిచ్చినట్లు తెలిపారు. అక్రమ గ్రావెల్ తవ్వకాలను ఆపాలని డిమాండ్ చేశారు.

ఉత్తమ విఆర్ఒకు అభినందన



కలెక్టర్ నుంచి అవార్డు స్వీకరిస్తున్న విఆర్ఒరామకాసు(ఫైల్)

ప్రజాశక్తి-సబ్బవరం : విఆర్ఒల సంఘం జిల్లా అధ్యక్షుడు, ఎస్‌టి.రామకాసు గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఉత్తమ విఆర్ఒగా జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ నుంచి అవార్డు స్వీకరించారు ఈ సందర్భంగా జిల్లాలోని విఆర్ఒలు, మండల విఆర్ఒల సంఘం నేతలు రామకాసును అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.

న్యాయ సహాయకుల నియామకానికి 29లోగా దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి - యలమంచిలి : మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో పనిచేయడానికి న్యాయ సహాయకుల దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆ సంస్థ అధ్యక్షులు, సివిల్ సీనియర్ జడ్జి పి.విజయ తెలిపారు. 10వ తరగతి పాసైన ఆసక్తి గల అభ్యర్థులు ఆధార్ జెరాక్స్ కాపీ జతచేసి రాజీవ్ క్రీడా మైదానాన్ని ఆనుకొని ఉన్న న్యాయ సేవాధికార సంస్థ కార్యాలయంలో ఈనెల 29న సాయంత్రం 5గంటల లోగా స్వయంగా దరఖాస్తులు అందివ్వాలని కోరుతున్నారు. ఎంపికైన అభ్యర్థులకు ఎటువంటి జీతభత్యాలు ఉండవని స్పష్టం చేశారు. న్యాయ సహాయం అందించాలనే దృక్పథం, ఇతరులకు సహాయపడాలనే దయాగుణం గల వారికి ప్రాధాన్యత ఇస్తామన్నారు. పారాలీగల్ వాలంటీర్లుగా పనిచేయడానికి స్త్రీ, పురుష అభ్యర్థులెవరైనా దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు.

అచ్చయ్యపాత్రుడు సేవలు మరువలేనివి

ప్రజాశక్తి- కె. కోటపాడు : ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా విధులను నిర్వహిస్తూనే సమాజం కోసం కూడా పనిచేసిన మంచి మనిషి అచ్చయ్య పాత్రుడు మాస్టారని పలువురు కొనియాడారు. సోమవారం మండలంలోని గొండుపాలెం గ్రామంలో విశ్రాంత ప్రధానోపాధ్యాయులు బండారు అచ్చయ్య పాత్రుడు సంస్మరణ కార్యక్రమం జరిగింది. శారీరక మానసిక ఆరోగ్యంతో పాటు దేశ సేవ కోసం పనిచేయాలని దక్పథాన్ని పలువురు విద్యార్థుల్లో తోటి ఉపాధ్యాయులలో స్ఫూర్తిని నింపిన వ్యక్తి అని గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో రాపర్తి సత్యనారాయణ, బండారు కాసుబాబు చిటిమిరెడ్డి దేముడు రొంగలి సత్యం, పెనమటి అప్పారావు, పూడి శ్రీరామమూర్తి, పైలా అమ్మాజీ పాల్గొన్నారు.

రహదారి భద్రతపై అవగాహన

ప్రజాశక్తి- కశింకోట : జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాలలో భాగంగా సోమవారం కశింకోట సెయింట్ ఆన్స్ విద్యార్థులకు స్థానిక సిఐ అల్లు స్వామినాయుడు అవగాహన కల్పించారు. రహదారిలో ప్రయాణించేటప్పుడు, రోడ్డు దాటేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, హెల్మెట్‌ధారణ, ఆటోలో ప్రయాణంలో జాగ్రత్తలు, ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు.కార్యక్రమంలో ఎస్ఐ పి. మనోజ్‌కుమార్, మోటార్ వెహికల్ ఇన్స్‌పెక్టర్ టి రాజన్న, అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్స్‌పెక్టర్ ఎ. గీత కావ్య, హైవే సిబ్బంది డికె.కృష్ణ అశోక్ కుమార్, అజయ్ కుమార్, కె.సత్యనారాయణ ప్రేమ్‌కుమార్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



శంకుస్థాపన, చేస్తున్న ఎమ్మెల్యే పంచకర్ల

ప్రజాశక్తి - పరవాడ : జివిఎంసి 79 వ వార్డు దేశపాత్రునిపాలెం, లంకెలపాలెంలలో రూ.నాలుగు కోట్లతో పలు అభివృద్ధి పనులకు స్థానిక కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్‌తో కలిసి సోమవారం ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు శంకుస్థాపన చేశారు. పార్క్‌ను ప్రారంభించారు.కార్యక్రమంలోగ్రామ పెద్దలు నాయకులు, ఇఇ అప్పారావు, ఎఇఇ సాగర్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఏడాదిలోగా మత్స్యకారులకు ఫార్మాసిటీలో ఉద్యోగాలు

మండలంలోని ముత్యాలమ్మపాలెం పంచాయతీలో పల్లె పండుగలో మంజూరైన పలు అభివృద్ధి పనులకు పంచాయతీ వారోత్సవాల్లో భాగంగా ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు శంకుస్థాపన చేపట్టారు .ఈ సందర్భంగా ముత్యాలమ్మపాలెం బహిరంగ సభలో 2012లో ఫార్మాసిటీలో పోరాడి సాధించిన ఉద్యోగాలు నేటికీ ఇవ్వడంలేదని స్థానిక సర్పంచ్ చింతకాయల సూజాత ఎమ్మెల్యే దృష్టికి తేగా, ఏడాదిలోగా మత్స్యకారులందరికీ ఫార్మాలో ఉద్యోగాలు కల్పిస్తామన్నారు. సముద్రతీరంలో మినీ జెట్టి, సమ్మంగిపాలెం గ్రామంలో కల్యాణం మండప నిర్మాణం, మత్స్యకారులకు సంక్షేమ కార్యక్రమాలు అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో, మాజీ జెడ్‌పిటిసి పైలా జగన్నాథరావు, మాజీ ఎంపిపి మాసవరపు, అప్పలనాయుడు, రావాడ సర్పంచ్ మోటారు సన్యాసినాయుడు, ఈ బోనంగి సర్పంచ్ బొద్దపు శ్రీనివాస్ కాసులు, టిడిపి మండల అధ్యక్షులు వియ్యపు చిన్నా , జనసేనకార్యదర్శి బూగిడి రామగోవిందరావు, కన్నూరు వెంకటరమణ, తహశీల్దార్ అంబేద్కర్, ఎంపిటిసి అర్జిల్లి దేవిరవి, కోఆప్షన్ సభ్యులు పైలపల్లి అప్పన్న ,మాజీ ఎంపిటిసి చింతకాయల అమ్మోరు, పిఎసిఎస్ మాజీ డైరెక్టర్ సూరాడ ముత్యాలరావు సూరాడ పెంటయ్య, అర్జిల్లి ప్రకాష్ ,ఒలిశెట్టి పోలమ్మ పాల్గొన్నారు.,

బెల్ట్‌షాపుల నియంత్రణలో విఫలం

సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు వెంకన్న

ప్రజాశక్తి- దేవరాపల్లి : గ్రామాల్లో మద్యం బెల్టు షాపులను వెంటనే తొలగించాలని, మహిళలు, బాలికలపై హత్యాచారాలు అరికట్టాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు డి వెంకన్న డిమాండ్ చేశారు సోమవారం స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ, గ్రామాల్లో బెల్టు.షాపులు పెట్టబోమని,పెడితే తాట తీయండని స్వయంగా ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటన అమలు కాకపోవడం విడ్డూరమన్నారు. జిల్లా వ్యాప్తంగా ప్రతి గ్రామంలోనూ రోడ్డు ప్రక్కన దాబాలు, టీ దుకాణాలు, పాన్‌షాపుల్లో విచ్చలవిడిగా మద్యం అమ్మకాలు జరుగుతున్నాయన్నారు. వీటిని నియంత్రించాల్సిన అధికారులు మామూళ్ల మత్తులో జోగడం శోచనీయమన్నారు. తక్కువ ధరకే మద్యం అమ్మకాలు చేపడుతున్నామని గొప్పలు చెప్పుకుంటున్న ప్రభుత్వం, నిత్యావసరాల ధరలు విపరీతంగా పెంచేశారని ఎద్దేవా చేశారు. విచ్చలవిడిగా, అందుబాటులో మద్యం దొరకడంతో టీనేజర్లు, యువత మద్యానికి బానిసలై జీవితాలను నాశనం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మద్యం మత్తులో అకృత్యాలకు పాల్పడుతున్నారన్నారు. ఎలమంచిలి మండలంలో 20 రోజులు వ్యవధిలో ఇద్దరు బాలికలపై అత్యాచార ఘటనలు, ఆదివారం యలమంచిలిలో 13 ఏళ్ల బాలికపై లైంగిక దాడి, 20 రోజులు ముందు ఎటికొప్పాకలో నాలుగేళ్ల బాలికపై అత్యాచారం పెడదోవ పడుతున్న సమాజ దుస్థితికి పరాకాష్ట అని ఆవేదన వ్యక్తం చేశారు. సంఘటన జరిగిన తర్వాత హడావిడి చేస్తున్న ప్రభుత్వ యంత్రాంగం, ఆయా ఘటనలు జరగకుండా పోలీసులు, ఇతర అధికారులు తగు చర్యలు చేపట్టకపోవడం శోచనీయమన్నారు., శాంతిభద్రతల పరిరక్షణలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, కూటమి నాయకులే దగ్గరుండి కోడి పందేలు, జూదమాడిస్తున్నారని మండిపడ్డారు. ప్రశ్నించడానికే పార్టీ పెట్టామని చెప్పుకునే ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, మహిళలపై అఘాయిత్యాలు, హోంమంత్రి నియోజకవర్గం, జిల్లాలో వరుస ఘటనలపై మాట్లాడరేమని ప్రశ్నించారు. ఇప్పటికైనా ప్రభుత్వం మేల్కొవాలని, బెల్ట్‌షాపులు, బాలికలు, మహిళలపై లైంగిక దాడులకు అడ్డుకట్ట వేయాలని డిమాండ్ చేశారు.

కరాటే, తైక్వాండో శిక్షణకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి- అనకాపల్లి : జిల్లాలో 126 ప్రభుత్వ మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలల్లో ఆరు నుంచి 8వ తరగతి చదువుతున్న 2215 మంది, 266 జిల్లా పరిషత్, కేజీబీవీ, మోడల్ స్కూల్స్, మున్సిపల్, సాంఘిక సంక్షేమ, గిరిజన సంక్షేమ, హైస్కూల్ ప్లస్ పాఠశాలల్లో ఆరు నుంచి తొమ్మిదవ తరగతి చదువుతున్న 27,469 మంది విద్యార్థినులకు రాణి లక్ష్మీబాయి ఆత్మరక్షణ పథకం కింద కరాటే, తైక్వాండో విద్యల్లో శిక్షణ ఇచ్చేందుకు వివిధ ఎన్జీవో సంస్థల నుంచి ఈనెల 29లోగా దరఖాస్తులు కోరుతున్నట్లు అనకాపల్లి జిల్లా సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ ఒక ప్రకటనలో తెలిపారు. 2025 ఫిబ్రవరి 1 నుంచి మార్చి 15 వరకు 20 సెషన్స్‌లో శిక్షణ ఇవ్వాల్సి ఉంటుందన్నారు. అర్హత వివరాలు, టెక్నికల్ క్వాలిఫికేషన్ వివరాలు, ఎంపిక విధానం, దరఖాస్తుకు సమర్పించవలసిన సర్టిఫికెట్ వివరాలు సమగ్ర శిక్ష కార్యాలయ వెబ్‌సైట్ apssakp.comలో పొందుపరిచామన్నారు. కొండ కొప్పాకలోని సమగ్ర శిక్ష కార్యాలయంలో ఈ నెల 29 లోగా నేరుగా దరఖాస్తులు అందజేయాలన్నారు. ఈనెల 30న ఎంపిక చేసి 31న వర్క్ ఆర్డర్ ఇస్తామన్నారు.

31న జాబ్‌మేళా

ప్రజాశక్తి- దేవరాపల్లి : మండల కేంద్రం దేవరాపల్లి హైస్కూల్లో ఈనెల 31న భారీ జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు మాజీ ఎంపిపి కిలపర్తి భాస్కరరావు తెలిపారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల పరిసరాలను పరిశీలించారు. మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి ఆధ్వర్యంలో నిర్వహించే జాబ్ మేళాలో అధిక సంఖ్యలో యువత పాల్గొని విధంగా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఈ అవకాశాన్ని నియోజకవర్గంలోని యువత సద్వినియోగం చేసుకోవాలని భాస్కరరావు కోరారు. కార్యక్రమంలో ఎంపిటిసి మొల్లి కష్ణమూర్తి, రైవాడ జలాశయ డైరెక్టర్ గుల్లిపల్లి మురళీ, ఉపాధ్యాయులు, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

బెగాస్ కొరతతో నిలిచిన క్రషింగ్

ప్రజాశక్తి -చోడవరం : బాయిలర్ మండించే బెగాస్(చెరుకు పిప్పి) కొరతతో గోవాడ సుగర్స్‌లో రెండు రోజులుగా క్రషింగ్ నిలిచిపోయింది. క్రషింగ్ ప్రారంభానికి ముందు సరిపడా బెగాస్ నిల్వలు ఉంచకోవాల్సిన యాజమాన్యం, తగు చర్యల్లో విఫలం వల్లే ఈ పరిస్థితి తలెత్తిందని రైతులు అంటున్నారు. ఇప్పటివరకు ఎనిమిదివేల టన్నులు క్రషింగ్ జరగ్గా, రెండురోజులుగా క్రషింగ్ నిలిచిపోవడంతో ఫ్యాక్టరీ ఆవరణలోనూ, వెంకన్నపాలెం యార్డులోనూ పెద్దసంఖ్యలో చెరుకులోడులతో వాహనాలు నిలిచిపోయాయి. బాయిలర్ మండించడానికి శ్రీకాకుళం నుండి బెగాస్‌ను రప్పిస్తున్నారు.

8 నుంచి ఉమామహేశ్వరి తీర్థం

ప్రజాశక్తి- దేవరాపల్లి: మండల కేంద్రంలోనిఉమా మహేశ్వరి దేవితల్లి తీర్థ మహోత్సవాలను వచ్చే నెల 8 శనివారం నుంచి 12 బుధవారం వరకు నిర్వహించనున్నారు. ఈ మేరకు మాజీ ఎంపిపి కిలపర్తి భాస్కరరావు అధ్యక్షతన సోమవారం ఉమామహేశ్వరిదేవి ఆలయంలో సమావేశమై ఐదు రోజులపాటు జరిగే తీర్థ మహోత్సవాలను విజయవంతం చేయాలని కోరారు. తీర్థాల సందర్భంగా ఏర్పాట్లపై గ్రామ పెద్దలతో చర్చించారు. సమావేశంలో ఆలయ ధర్మకర్త వరదప్పరెడ్డి లలితా ప్రసాద్, గ్రామ పెద్దలు ఎల్లెటి కరుణాకర రావు, గుండు రాంబాబు, ఇట్ల వెంకటపతి, వెత్స రమేష్, మిడతాడ అప్పారావు, దీవి శంకరరావు, పరవాడ రవి, మొల్లి కష్ణమూర్తి, గుల్లిపల్లి మురళి, సిమ్మ అప్పన్న, కొల్లి ఈశ్వరరావు, సబ్బవరపు మాలిబాబు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



'జనవాణి'లో ఎమ్మెల్యే సుందరపు

ప్రజాశక్తి - యలమంచిలి : మంగళగిరిలో జనసేన కేంద్ర కార్యాలయంలో సోమవారం 'జనవాణి' కార్యక్రమంలో యలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ పాల్గొని, అర్జీలను స్వీకరించారు.


ఉత్తమ అధికారులకు ఘన సత్కారం



నక్కపల్లిలో ఎంపిడిఒను సత్కరిస్తున్న నాయకులు

ప్రజాశక్తి-నక్కపల్లి:గణతంత్ర దినోత్సవం రోజున ఉత్తమ ఉద్యోగులుగా జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ చేతుల మీదుగా సేవా పురస్కారం అందుకున్న తహసీల్దార్ ఆర్ నరసింహమూర్తి, ఎంపీడీవో డి సీతారామరాజు, ఎంఈఓ కే నరేష్, సర్వేయర్ పి.సత్తిబాబు, సిహెచ్‌సి జూనియర్ అసిస్టెంట్ కంప్యూటర్ ఆపరేటర్ వై.నాయుడు లను సోమవారం తెలుగుదేశం పార్టీ మండల శాఖ అధ్యక్షులు కొప్పిశెట్టి వెంకటేష్ ఆధ్వర్యంలో ప్రజా ప్రతినిధులు, నాయకులు సత్కరించారు. పురస్కారం అందుకున్న అధికారుల సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు మెరుగు నాగేశ్వరరావు, సర్పంచ్ శంకర్రావు, టిడిపి నాయకులు వెలగా శ్రీనివాసరావు, వైబోయిన రమణ, దార్ల కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

రావికమతం:ఉత్తమ అవార్డు గ్రహీత రావికమతం తహసిల్దార్ వెంకటరమణ, ఎంపీపీ పైలరాజులను మండల టిడిపి పార్టీ అధ్యక్షులు రాజాన కొండ నాయుడు, పలువురు గ్రామ రెవెన్యూ అధికారులు ఘనంగా సన్మానించారు. ఇదే స్ఫూర్తితో రావికమతం మండలాన్ని అభివృద్ధి పథంలో నడిపించే విధంగా పని చేయాలన్నారు. తహసిల్దారు వెంకటరమణ మాట్లాడుతూ, మండల ప్రజా ప్రతినిధులు, ఉన్నత స్థాయి అధికారుల సహకారంతో తనకు మంచి గౌరవం లభించిందన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు గల్లా రాజేశ్వరరావు, ఎంపిటిసి వేపాడ నాగేశ్వరరావు, వీఆర్వోలు ఆసరి శ్రీనివాసరావు, మూర్తి, బాలాజీ, కమల



కొత్తకోటలో ఎస్ఐకు సత్కారం



రావికమతం తహశీల్దార్‌ను సత్కరిస్తున్న నాయకులు

పాల్గొన్నారు.

కొత్తకోట:రిపబ్లిక్ డేను పురస్కరించు కొని ఉత్తమ అవార్డు పొందిన కొత్తకోట ఎస్సై శ్రీనివాస్ ను సోమవారం స్టేషన్ ఆవరణలో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు రాజాన కొండనాయుడు ఆధ్వర్యంలో టీడీపీ కార్యకర్తలు ఘనంగా సత్కరించారు. అలాగే రావికమతం మండలం నుంచి ప్రశంసపత్రాలు అందుకున్న తహసీల్దార్ వెంకటరమణ ను ఎంపీపీ పైలరాజు, మండల టీడీపీ నాయకులు, సర్పంచ్, ఎంపీటీసీలు రెవెన్యూ సిబ్బంది ఘనంగా సన్మానించారు.భవిష్యత్తు లో ఉన్నత పతకాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈకార్యక్రమంలో బిజెపి స్టేట్ కౌన్సిలర్ గల్లా రాజేశ్వరరావు టీడీపీ శ్రేణులు కోట సత్యనారాయణ, వెర్నలకి ఈశ్వరరావు,ఉగ్గిన శ్రీను కలం నర్సింగరాజు, బంటు శ్రీను,ఆచారి గొర్లి కపారావు పాల్గొన్నారు.



పరీక్షిస్తున్న పశుసంవర్ధక శాఖ అధికారులు

లేగ దూడల ప్రదర్శన

ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్:మండలంలో అమలాపురం గ్రామంలో నిర్వహించిన పశు ఆరోగ్య శిబిరాలలో భాగంగా లేగ దూడల ప్రదర్శన ఆకట్టుకుంది. ఈ కార్యక్రమాన్ని నర్సీపట్నం సహాయ సంచాలకులు రాంబాబు ప్రారంభించారు. లేగ దూడలకి నట్టల నివారణ మందులు వేశారు. విజేతలుగా .నిలిచిన లే గ దూడల పాడి రైతులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో వేములపూడి పశువైద్యాధికారి నరేష్, పాడి పశువులకు పశువుల కు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందించారు.ఈ కార్యక్రమం లో సర్పంచ్ శెట్టి శ్రీను , మాజీసర్పంచ్ శెట్టి లచ్చా పాత్రుడు,లాలం గోవింద ,పైల గంగాధర్ , పాడి రైతులు మరియు పశు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



విద్యాసామగ్రి పంపిణీ చేస్తున్న ఛైర్మన్

విద్యా సామగ్రి పంపిణీ

ప్రజాశక్తి-రోలుగుంట:మండలంలోని బుచ్చంపేట గ్రామానికి చెందిన యూత్ ఐకాన్, నవతరం ఫౌండర్ సబ్బావరపు లక్ష్మీనారాయణ(చంటి) పుట్టిన రోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా నిరుపేదలకు అన్నదానం, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ చేశారు.ఆసుపత్రి రోగులకు పోషకాహారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, స్కూల్ కమిటీ ఛైర్మన్ ఉలబాల రమణ, వార్డు కార్యదర్శి అనిమిరెడ్డి రమణ, కర్రి రాము నాయుడు, రెడ్డి భాస్కర్‌రావు, పెబ్బులి శ్రీను పాల్గొన్నారు.



పంపిణీ చేస్తున్న క్లబ్ సభ్యులు, నేతలు, ఉపాధ్యాయులు

కంచాలు, గ్లాసుల అందజేత

ప్రజాశక్తి -కొత్తకోట:కొత్తకోట వాసవి వనిత క్లబ్ నూతన కార్యవర్గం ఏర్పాటైంది. అధ్యక్షులుగా పెనుగొండ శోభారాణి, వైస్ ప్రెసిడెంట్ గా గ్రంధి రాణి,సెక్రటరీగా పెనుగొండ వినీత, ట్రెజరర్‌గా కేదార్శెట్టి సునీత తదితరులు ఏక గ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన కమిటీ ఆధ్వర్యం లో తొలిసారిగా ఈరోజు 76వ గణతంత్ర దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని కొత్తకోట మండల పరిషత్ ఉన్నత పాఠశాల మెయిన్ స్కూల్‌లో విద్యార్థులకు 90 స్టీలు భోజనం ప్లేట్లు, 40 స్టీలు గ్లాసులు అందజేశారు. అనంతరం పాఠశాల ఆవరణలో సరస్వతి దేవి మహాత్మా గాంధీ పొట్టి శ్రీరాములు వారి విగ్రహలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళి అర్పించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రెడ్డి సత్యనారాయణ, గ్రామ సర్పంచ్ లోవరాజు, ఉపసర్పంచ్ పందల దేవ, సీనియర్ టీడీపీ నాయకులు కోట గోవిందరావు, విశ్రాంత ఉపాధ్యాయులు బేత నూకరాజు పాల్గొన్నారు.

కొనసాగిన పశు వైద్య శిబిరాలు



చీడికాడలో.. పరీక్షిస్తున్న వైద్యులు

ప్రజాశక్తి-చీడికాడ:మండలంలో బి.సింగవరం, తునివలస గ్రామాలలో ఉచిత పశు వైద్య శిబిరాలను కండివరం పశువైద్యాధికారి ఎస్‌సి హెచ్ గణేష్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,ఉచిత పశు వైద్య శిబిరాన్ని పాడి రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. పశువులు పట్ల ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలో వివరించారు. వ్యాధి నిరోధక టీకాలు వేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు సరగడం శివ, పాల సంఘం అధ్యక్షులు సరగడం రవి, అనకాపల్లి జిల్లా తెలుగు నాడు స్టూడెంట్ ఫెడరేషన్ జిల్లా సెక్రెటరీ తరుణ్, వార్డ్ మెంబర్ సోమనాయుడు పాల్గొన్నారు.

అనకాపల్లి : ప్రభుత్వ పథకాలను, పశు వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని పశుసంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్, ప్రత్యేక అధికారి డాక్టర్ ఆర్.చిన్నయ్య అన్నారు. సోమవారం మండలంలోని గొలగాం శివారు కొత్త తలారివానిపాలెం గ్రామంలోఉచిత పశు వైద్యశిబిరంలో పాల్గొన్నారు.. పశువులకు గర్భకోశ వ్యాధుల చికిత్సలు, పశువులకు ఆరోగ్య పరీక్షలు, మేకలకు నట్టల నివారణ మందులు అందజేశారు. వెటర్నరీ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ ఎం.చంద్రశేఖర్, అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ బి సౌజన్య, ఎంపిఇసి చంద్రశేఖర్, మాజీ సర్పంచ్, వెటర్నరీ డాక్టర్ జిబి శ్యామల, కొండకొప్పాక పశు వైద్యశాల సిబ్బంది పాల్గొన్నారు.

తుమ్మపాల రైతు సేవా కేంద్రంలో మండల పశు వైద్యాధికారి డాక్టర్ సిహెచ్.అనిల్ కుమార్ ఆధ్వర్యం లో 86 పశువులకు గర్భకోశ వ్యాధుల చికిత్సలు, 45దూడలు, 100 మేకలకు నట్టల నివారణ మందులు అందజేశారు. పాడిరైతుల సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించారు. తుమ్మపాల సర్పంచ్ తట్ట పెంటయ్య నాయుడు, ఎంపిటిసిలు చదరం నాగేశ్వరరావు, పి.కన్నరావు, మాజీ సర్పంచ్ కర్రి వెంకట సన్యాసినాయుడు, నీటి సంఘం ఛైర్మన్ పీలా సీతారామ్, మిల్క్ సొసైటీ ప్రెసిడెంట్ చదరం కాశి విశ్వేశ్వర రావు, సిబ్బంది కుమారి, వెంకట్, సంతోష్, కిరణ్, కావ్య, గోపాల మిత్రలు రమణ, హరికృష్ణ పాల్గొన్నారు.

కశింకోట : మండలంలోని విస్సన్నపేట గ్రామంలోఉచిత పశు వైద్య శిబిరాన్ని సర్పంచ్ ఉప్పునూరి మాణిక్యం అప్పారావు ప్రారంభించారు పశు వైద్యులు ఆల్ఫాన్స్ జార్జ్ పాల్గొని 70 పశువులకు డీవార్మింగ్, 28 పశువులకు గర్భ కోశ పరీక్షలు చేశారు. మినరల్ మిక్సర్ ప్యాకెట్లను అందజేశారు. మాజీ సర్పంచ్ సిద్దిరెడ్డి శ్రీను, కూనిసెటి ప్రకాష్ రావు, మండే శ్రీనివాసరావు, పల్లేల శ్రీనివాస్, లక్ష్మి పాల్గొన్నారు.

సబ్బవరం : మండలంలోని మొగలిపురం గ్రామంలో ఉచిత పశు ఆరోగ్య శిబిరాన్ని సర్పంచ్ గండి అరుణ ప్రారంభించారు. గుల్లేపల్లి పశు వైద్యాధికారి డాక్టర్ బి. సంధ్య ఆధ్వర్యంలో 22 పశువులకు వైద్య పరీక్షలు, 40 గర్భకోశ వ్యాధుల చికిత్సలు, 18చూడి తనిఖీలు, 62 దూడలకు, జీవాలకు నట్టల నివారణ మందులు, అందించారు. ఎంపిటిసి తమరాన సన్యాసమ్మ బంగారునాయుడు, ఆరిపాక పశు వైద్యాధికారి డాక్టర్ ఎస్. స్వర్ణలత, వెటర్నరీ అసిస్టెంట్లు ఎ.రమేష్, డి. రమేష్, గోపాలమిత్ర దేముడుబాబు, ల్యాబ్ టెక్నీషియన్ మళ్ల శంకర్, అంగటి నానాజీ, తమరాన సత్యనారాయణ, మేడపాటి రాము, అయినింటి రాజు, లైన్‌మ్యాన్ నాయుడు పాల్గొన్నారు.

పరవాడ :భరణికం, నాయుడుపాలెం గ్రామాలలో ఉచిత పశు ఆరోగ్య శిబిరాలలో 427 పశువులకు వైద్య సేవలు అందించారు. పరవాడ పశు సంవర్ధక శాఖ సబ్ డివిజనల్ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ రామకృష్ణ కీర్తి,వాడ చీపురుపల్లి, లంకెలపాలెం పశువైద్యులు డాక్టర్ సురేష్ కుమార్, డాక్టర్ అశ్విని ప్రవుల్లా, పశు సంవర్ధక శాఖ సహాయకులు పద్మ, నూకరత్నం, శ్రీను, లక్ష్మణ్, భాస్కర్, బాలాజీ, కృష్ణ, సన్యాసి నాయుడు, నాగేశ్వరరావు, భరణికం గ్రామ సర్పంచ్ పెదిశెట్టి పూజా శేఖర్, మాజీ సర్పంచ్ బొండా తాతారావు, నాయుడుపాలె సర్పంచ్ వరలక్ష్మీ సీతారామయ్య పాల్గొన్నారు.



వెండి విరాళం అందిస్తున్న దాతలు

ఆలయానికి కిలో వెండి విరాళం

ప్రజాశక్తి-మాడుగుల:మండలంలోని ఎం. కోడూరులో మోదకొండమ్మ అమ్మవారికి విశాఖపట్నం చెందిన కీర్తిశేషులు గాలి రుద్రి వెంకటలక్ష్మి కుమారులు గాలి వెంకట ఈశ్వర అప్పారావు, సర్వ లక్ష్మి దంపతులు, గాలి గంగాధర్ కుమార్, రామలక్ష్మి దంపతులు కిలో వెండిని సోమవారం ఆలయ కమిటీ చైర్మన్, గ్రామ సర్పంచ్ గొల్లవిల్లి సంజీవరావుకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు శ్రీనివాస్ శర్మ, పడాల అప్పలనాయుడు, ఎంపీటీసీ ముమ్మిన రమణబాబు జల్లి హరిప్రసాద్, సేనాపతి గణేష్ మజ్జి మహేష్, లంక వరహమూర్తి, పప్పల అర్జునరావు తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యలపై వినతులు



వినతిపత్రాన్ని ఇస్తున్న బాధితుడు

ప్రజాశక్తి- నక్కపల్లి:వేంపాడు రెవెన్యూ పరిధిలో తమకు వారసత్వంగా సంక్రమించిన భూమిని ఒక అసామి తప్పుడు రికార్డు సృష్టించి, రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని, దాన్ని రద్దు చేసి తమ భూమిని అప్పగించాలని కల్లేపల్లి కుటుంబానికి చెందిన బాధితులు కోరారు. సోమవారం నర్సీపట్నం ఆర్‌డిఒ వివి రమణకు, తహసీల్దార్ ఆర్ నరసింహమూర్తి, సబ్ రిజిస్టర్ మూర్తి, పోలీసులకు ఆ భూమి రిజిస్ట్రేషన్ పై ఫిర్యాదు చేశారు. మండలంలోని వేంపాడు రెవెన్యూ పరిధిలో సర్వే నెం. 276/1లో 7 ఎకరాల 31 సెంట్లు భూమి పూర్వం నుండి పంట పండించు కుంటున్నామని తెలియజేశారు. తమ కుటుంబానికి సంబంధం లేని వ్యక్తి అమలాపురం పంచాయతీ శివారు మూలపర్ర గ్రామానికి చెందిన అసామి తప్పుడు రికార్డులు సృష్టించి నక్కపల్లి సబ్ రిజిస్టర్ కార్యాలయంలో తమ భూమిని రిజిస్ట్రేషన్ చేయించుకున్నట్లు రికార్డుల్లో నమోదయి ఉందని ఆవేదన వెలిబుచ్చారు. తమ భూమిని తమకు అప్పగించాలని అధికారులను కోరారు. ఫిర్యాదు చేసిన వారిలో కల్లేపల్లి వెంకటపతి రాజు, రామరాజు, అప్పలరాజు, శ్రీను రాజు, కృష్ణరాజు, సత్యనారాయణరాజు తదితరులు ఉన్నారు.

నర్సీపట్నం టౌన్: తమ భూమిని కబ్జాకు పాల్పడ్డారని పాయకరావుపేట మండలం పాల్తేరు గ్రామానికి చెందిన కేదారిశెట్టి సత్యనారాయణ సోమవారం స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో స్పందన కార్యక్రమంలో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పాల్తేరు గ్రామంలో సర్వే నెంబర్ 138/6లో 20 సెంట్లు భూమిని నక్కపల్లి రిజిస్ట్రార్ ఆఫీసులో రిజిస్టర్ చేయించుకున్నానన్నారు. ఈ భూమిలో అదే గ్రామానకు చెందిన కొంతమంది తన స్థలం కబ్జా చేసి దౌర్జన్యం చేస్తున్నారన్నారు.

స్టీల్‌ప్లాంట్‌కు ప్యాకేజీ శాశ్వత పరిష్కారం కాదు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్:ప్రభుత్వ రంగంలోని విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేట్ కాకుండా ఆగాలంటే, రూ.11440 కోట్ల ప్యాకేజీ పరిష్కారం కాదని సిఐటియు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.కె. ఎస్.వి కుమార్, అనకాపల్లి జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆర్.శంకరరావు, జి.కోటేశ్వరరావు అన్నారు. స్టీల్ ప్లాంట్ ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద కార్మిక సంఘాల జెఎసి చేపట్టిన దీక్షలు సోమవారం నాటికి 1400 రోజుకు చేరాయి. దీక్షల్లో పాల్గొన్న వారు మాట్లాడుతూ, స్టీల్ ప్లాంట్ రక్షణ కోసం ఎన్ని రోజులైనా పోరాడటానికి, ఎలాంటి త్యాగాలైనా చేయడానికి కార్మిక వర్గం సిద్ధంగా ఉన్నారని తెలిపారు. 2021 జనవరి 27 న ప్రధాని మోడీ స్ట్రాటజిక్ సేల్ పేరుతో స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేటీకరణ చేస్తున్నట్లు ప్రకటించారన్నారు. నాటి నుండి నేటి వరకూ ఎన్ని అవాంతరాలు వచ్చినా, కోవిడ్ సమయంలో కూడా దీక్షా శిబిరాన్ని కొనసాగిస్తూ కార్మికులు పోరాడుతున్నారన్నారు. స్టీల్ ప్లాంట్‌కి కేంద్ర ప్రభుత్వం రూ.11,440 కోట్ల ప్యాకేజీ ప్రకటించిందని ఇది కార్మిక వర్గం పోరాట ఫలితమని పేర్కొన్నారు. కానీ, స్టీల్ ప్లాంట్ కు ప్యాకేజీ పరిష్కారం కాదని ఇది తాత్కాలిక ఉపశమనం మాత్రమే అన్నారు. స్టీల్ ప్లాంట్ కు సొంత గనులు కేటాయించడమే శాశ్వత పరిష్కారం అన్నారు. రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం స్టీల్ ప్లాంట్ కోసం సొంత గనులు కేటాయించే విధంగా కేంద్ర ప్రభుత్వం మీద ఒత్తిడి తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఎంతోమంది ప్రాణ త్యాగాలతో, పదవీ త్యాగాలతో సాధించుకున్నటువంటి స్టీల్ ప్లాంట్ రక్షణ కోసం కార్మిక వర్గం ఐక్యంగా పట్టుదలగా ప్రజలందరినీ కలుపుకొని వెళ్లే విధంగా కృషి చేస్తామని తెలియజేశారు. ఇప్పటికే ఈ పోరాటం 4 సంవత్సరాల కాలం నుంచి నిరాటంకంగా జరుగుతుందని భవిష్యత్తులో, ఎన్నేళ్లయినా ప్లాంట్ ప్రైవేటీకరణని ప్రభుత్వం ఉపసంహరించుకునే వరకు పోరాడుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం జిల్లా కార్యదర్శి వై.సత్యవతి నాయకులు బి. భారతి,కె మణి, బి.సత్యవతి, సుజాత సిఐటియు నాయకులు వి.కృష్ణారావు ప్రొఫెసర్ ఎస్.సూరప్పడు తదితరులు పాల్గొన్నారు.



దీక్షలో కూర్చున్న సిఐటియు నేతలు



పరీక్షిస్తున్న వైద్యులు

వైకల్య నిర్ధారణ పరీక్షలు

ప్రజాశక్తి-మాడుగుల:రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వుల మేరకు అనర్హులైన వికలాంగ పెన్షన్‌పై సర్వేను మాడుగులలో ఎంపిడిఒ కొంకి అప్పారావు ఆధ్వర్యంలో సోమవారం చేపట్టారు. పట్టణంలో 16మంది, మండలంలోని 58 వికలాంగ పెన్షన్లు ఉండగా, ప్రభుత్వ ఆదేశాల మేరకు వాటన్నింటినీ పరిశీలిస్తున్నారు. పింఛనుదారులను ఆర్థోపెడిక్ నిపుణులు డాక్టర్ కృష్ణమూర్తి, జనరల్ ఫిజీషియన్ అరుణ పరీక్షించారు. వికలాంగ లబ్ధిదారులందరినీ పరిశీలించిన తర్వాత నివేదికను జిల్లా అధికారులకు పంపిస్తామన్నారు.ఈ కార్యక్రమంలో మాడుగుల పంచాయతీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ కె.మూర్తిబాబు, పంచాయతీ కార్యదర్శులు కే.కిరణ్ కుమార్, అప్పలరాజు, ఏఎన్ఎం సుగుణ, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.



పనులు ప్రారంభిస్తున్న సర్పంచ్, నాయకులు

తాగునీటి బోరు పనులు ప్రారంభం

ప్రజాశక్తి-రావికమతం:జల జీవన మిషన్ ద్వారా మంజూరైన మంచినీటి రిగ్గు బోరు పనులను రావికమతంలో సోమవారం సర్పంచ్ గంజి మోది నాయుడు ప్రారంభించారు. రావికమతం గ్రామానికి 60 వేల లీటర్ల సామర్థ్యం గల ఓవర్ హెడ్ వాటర్ ట్యాంక్ నిర్మాణానికి కోటి 45 లక్షలు జల జీవన మిషన్ పథకం ద్వారా నిధులు విడుదల అయ్యాయన్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపడుతున్న జల జీవన్ మిషన్ పథకం కింద ప్రతి ఇంటికి మంచినీటి సదుపాయం అందించను న్నామన్నారు. ఈ కార్యక్రమంలో రావికమతం ఎంపీటీసీ వేపాడ నాగేశ్వరరావు, వైఎస్ఆర్సిపి మండల కన్వీనర్ కంచిపాటి జగన్నాధరావు, చోడవరం నియోజకవర్గం దివ్యాంగుల హక్కుల పోరాట సమితి కన్వీనర్ గంజి శ్రీనివాసరావు, కూటమి నాయకులు పులగాయల సత్యనారాయణ, తలాటం సూరిబాబు, గ్రామ టిడిపి అధ్యక్షులు గెంజి ఈశ్వరరావు, రాంసూరి పాల్గొన్నారు.



స్టడీ మెటీరియల్ ఇస్తున్న పద్మావతి, రాజేష్

స్టడీ మెటీరియల్ అందజేత

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్: నియోజకవర్గంలోని ప్రభుత్వ ఉపాధ్యాయులకు పదో తరగతి స్టడీ మెటీరియల్‌ను స్పీకర్ అయ్యన్నపాత్రుడు సతీమణి పద్మావతి, 25వార్డ్ కౌన్సిలర్ రాజేష్ బాబు చేతుల మీదుగా సోమవారం పట్టణంలో సోమవారం అందజేశారు. ఈ స్టడీ మెటీరియల్ అల్లాడ చారిటబుల్ ట్రస్ట్, అల్లాడ సురేష్ కుమార్ ఆర్థిక సహాయంతో అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పథకాలను ప్రజలకు వివరించాలి

-ఉత్తరాంధ్ర ప్రజాప్రతినిధుల సమావేశంలో మంత్రి నారా లోకేష్

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్: ఉత్తరాంధ్ర ప్రజల అభివృద్ధి, సంక్షేమానికి కూటమి ప్రభుత్వం చేస్తున్న మంచిని ఇంటింటికి వెళ్లి నేతలు వివరించాలని విద్య,ఐటి శాఖల మంత్రి నారా లోకేష్ అన్నారు. విశాఖ తెలుగుదేశం కార్యాలయంలో సోమవారం అందుబాటులో ఉన్న ఉత్తరాంధ్ర ప్రజాప్రతినిధులు, నాయకులతో లోకేష్ సమావేశమయ్యారు. పార్టీ బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యలతో పాటు సంస్థాగత అంశాలపై దాదాపు రెండున్నర గంటల పాటు చర్చించారు. ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడుతూ, క్లస్టర్, యూనిట్, బూత్ కమిటీలను బలోపేతం చేయడంపై నేతలు దృష్టి సారించాలన్నారు. కోటికి పైగా సభ్యత్వ నమోదుతో తెలుగుదేశం పార్టీ చరిత్ర సృష్టించిందన్నారు. పార్టీ వల్లే ఈ స్థాయిలో మనం ఉన్నామని నాయకులు గుర్తుంచుకోవాలన్నారు. పార్టీ వల్లే, తాను యువగళం పాదయాత్ర చేయగలిగానని చెప్పారు. ఏపి అభివృద్ధికి ప్రధాని మోడీ సహకరిస్తున్నారన్నారు. ఎన్డీయే ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించాలన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని నేతలకు దిశానిర్దేశం చేశారు. రైల్వే జోన్, విశాఖ స్టీల్ ప్లాంట్ సమస్యలు 7 నెలల్లోనే పరిష్కరించామన్నారు. అనేక ఐటి కంపెనీలు, పరిశ్రమలు తీసుకొస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావుతో పాటు విశాఖ ఎంపి శ్రీ భరత్, ఉత్తరాంధ్ర జిల్లాల ప్రజాప్రతినిధులు, నాయకులు , తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న లోకేష్

ఘనంగా ఎలక్ట్రీషియన్ డే

ప్రజాశక్తి -ఎస్.రాయవరం: మండలంలోని అడ్డురోడ్డు తిమ్మాపురం గ్రామంలో ఎలక్ట్రీషియన్ల దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. సోమవారం ఉదయం ఎలక్ట్రీషియన్ల సంఘం మండలశాఖ అధ్యక్షుడు దారబోయిన గణేష్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో యస్‌విఎస్ హార్డ్‌వేర్ అధినేత సారధి ముఖ్య అతిధిగా పాల్గొని జెండా ఆవిష్కరణ చేశారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, థామస్ అల్వా ఎడిషన్ విద్యుత్ బల్బును కనుగొన్న రోజున ఎలక్ట్రీషియన్ దినోత్సవంగా జరుపుకోవడం ఆనందదాయకమన్నారు. అనంతరం ఎలక్ట్రీషియన్ల ఐడి కార్డులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎలక్ట్రీషియన్ షాపుల యజమానులు, ఎలక్ట్రీషియన్లు పాల్గొన్నారు.



కేక్‌ను కట్ చేస్తున్న ఎలక్ట్రీషియన్లు

నష్ట పరిహారం చెల్లించాలని

కారిడార్ నిర్వాసితుల ధర్నా

ప్రజాశక్తి -అనకాపల్లి:విశాఖపట్నం-చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ చందనాడ పంచాయతీ పరిధిలో నిర్వాసితులకు తక్షణమే నష్ట పరిహారం చెల్లించాలని కోరుతూ సోమవారం కలెక్టరేట్ ముందు నిర్వాసితులు ధర్నా నిర్వహించారు. అనకాపల్లి జిల్లా నక్కపల్లి మండలం చందనాడ పంచాయతీ శివారు తమ్మయ్యపేట, తుమ్మలపేట గ్రామాలలో ప్రభుత్వం వైజాగ్ చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ ఏర్పాటుకు భూములు సేకరిస్తుంది. తమ్మయ్యపేట గ్రామం చుట్టూ ఉన్న భూములకు నష్ట పరిహారం చెల్లించారని, సర్వే నెంబర్ 90 సబ్ డివిజన్ లో భూములకు, ఇళ్లకు నష్టపరిహారం చెల్లించలేదని నిర్వాసితులు వాపోయారు. ఏపిఐఐసి రైతుల దగ్గర, గృహ నివాలసు దగ్గర నేరుగా రిజిస్ట్రేషన్ చేసుకుంటామని గతంలో తెలిపారని గుర్తు చేశారు. దీనిపై అనకాపల్లి జిల్లా కలెక్టర్ కార్యాలయ ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ జాహ్నవికి వినతి పత్రం అందజేశారు. పద్దెనిమిది సంవత్సరాలు నిండిన వారికి ఇరవై ఐదు లక్షలు రూపాయలు ప్యాకేజీ ఇవ్వాలని కోరారు. రాజయ్యపేట గ్రామంలో డి ఫారం, సాగు భూములలో చెట్లకు నష్టపరిహారం చెల్లించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్ సీపీ నాయకులు వీసం రామకృష్ణ, సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.అప్పల రాజు, చందనాడ ఎంపిటిసి గంటా తిరుపతి రావు,చందనాడ సర్పంచ్ తళ్ళ రోహిణి భార్గవ్, గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.



నినాదాలు చేస్తున్న సిపిఎం, వైసిపి నాయకులు, నిర్వాసితులు